విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 272 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 22 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## మద్యం స్కాంలో వాసుదేవరెడ్డి అరెస్టు

- ఈ నెల 27 వరకూ రిమాండ్ విధింపు
- గుంటూరు జిల్లా జైలుకు తరలింపు
- మద్యం కుంభకోణం శరీరమైతే.. వాసుదేవరెడ్డి తలలాంటి వారు
- గతంలో ఏసీబీ కోర్టు వ్యాఖ్యలు

జగన్ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మొత్తం కుంభకోణంలో అన్నీ తానై ప్రధానపాత్ర పోషించిన రెండో నిందితుడు (ఏ-2), అప్పటి బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ డి.వాసుదేవరెడ్డిని సిట్ అధికారులు శనివారం మధ్యాహ్నం అరెస్టుచేశారు. ఈ కేసులో విచారణకు రావాలని ఈ నెల 9న సిట్ అధికారులు నోటీసులివ్వగా వాసుదేవరెడ్డి శనివారం ఉదయం హాజరయ్యారు. దర్యాప్తు బృందం ఎన్నిసార్లు

- మిగతా2లో

# ప్రజలకు మెరుగైన జీవనం అందిస్తాం

- దేశంలో ఏ రాష్ట్రం ఏపీకి దరిదాపుల్లో లేనంత సంక్షేమాన్ని అందిస్తున్నాం: సీఎం చంద్రబాబు
- పల్నాడు జిల్లా వినుకొండలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- ఘన వ్యర్థాల సేకరణ కోసం స్వచ్ఛ రథాన్ని, ఈ-ఆటోలను ప్రారంభించిన చంద్రబాబు
- సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని సూపర్ హిట్ చేసి చూపించామని ఉద్ఘాటన
- 561 స్వయం సహాయక సంఘాలకు రూ. 100.14 కోట్ల చెక్కు అందజేత



సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, ఏ రాష్ట్రం కూడా ఏపీకి దరిదాపుల్లో లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం జరిగిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తాము ప్రకటించిన సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని సూపర్ హిట్ చేసి చూపించామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల సేకరణ కోసం ఏర్పాటు చేసిన 'స్వచ్ఛ రథాన్ని', ఈ-ఆటోలను జెండా ఊపి ప్రారంభించారు.

**దేశంలోనే ఏపీ అగ్రగామి**

ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు అన్నారు. "దేశంలో ఏ రాష్ట్రమూ ఏపీకి దరిదాపుల్లో లేనంత సంక్షేమాన్ని అందిస్తున్నాం. మొదటి తారీఖునే పేదల సేవలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో స్వయంగా పాల్గొంటున్నాను. 'తల్లికి వందనం' ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా ఆర్థిక సాయం అందిస్తున్నాం. 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు మూడు విడతల్లో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నాం" అని వివరించారు.

**మహిళా సాధికారత, ప్రజల భాగస్వామ్యం**

మహిళల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. "స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వారు ఈ పథకాన్ని చక్కగా వినియోగించుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. లక్ష మంది మహిళలను ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దుతున్నాం" అని పేర్కొన్నారు. పీ4 కార్యక్రమం కింద ఇప్పటివరకు 10 లక్షల కుటుంబాలను దత్తత తీసుకున్నామని, వారికి మార్గనిర్దేశం చేసేందుకు లక్ష మంది మార్గదర్శులు ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 561 స్వయం సహాయక సంఘాలకు రూ.100.14 కోట్ల చెక్కును అందించారు.

- మిగతా2లో




## ఐదేళ్లలో చొరబాటుదారులనూ తరిమేస్తాం

గువాహటి: రాబోయే ఐదేళ్లలో చొరబాటుదారుల్ని ఓటరు జాబితాల నుంచే మాత్రమే కాదు దేశం నుంచీ తరిమేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం వ్యాఖ్యానించారు. అస్సాంలోని కామ్‌రూప్‌లో పదో అస్సాం బెటాలియన్ కొత్త క్యాంపస్ శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన ప్రసంగించారు. "నక్సలిజం నుంచి విముక్తి

- మిగతా2లో

## కాంగ్రెస్ నేతలు బట్టలు విప్పి తిరగడం దారుణం



- ఇలాంటి పనులు దేశ ప్రతిష్ఠకు నష్టం కలిగిస్తాయని వ్యాఖ్య
- టెక్నాలజీని ప్రజల మేలు కోసమే వినియోగిస్తామన్న ముఖ్యమంత్రి
- విశాఖలో గూగుల్ డేటా సెంటర్, అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఢిల్లీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సదస్సులో కాంగ్రెస్ నేతలు బట్టలు విప్పి నిరసన తెలపడం

- మిగతా2లో

## స్థానిక సంస్థల్లో పార్టీ బలం పెంచేలా సభ్యత్వ నమోదు

**జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్**



'జనసేన సభ్యత్వ నమోదు పవన్‌కల్యాణ్ ఉన్నత ఆలోచనలు, ఆశయాలతో నిండిన మహాయజ్ఞం. భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి బలాన్ని సమీకరించేలా ఈ బాధ్యత నిర్వర్తించాలి' అని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్,

- మిగతా2లో

## ఖనిజ రంగంలో సహకారానికి భారత్-బ్రెజిల్ ఒప్పందం

**మోదీ, లులా చర్చలు**



దిల్లీ: రానున్న ఐదేళ్ల కాలంలో వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 3,000 కోట్ల డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని భారత్-బ్రెజిల్ నిర్ణయించాయి. ప్రధాని మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వాల మధ్య శనివారం జరిగిన చర్చల పర్యవసానంగా

- మిగతా2లో

## ప్రపంచంపై మళ్లీ పిడుగు

- సుంకాలను 15శాతానికి పెంచుతానన్న ట్రంప్
- కోర్టు తీర్పును అధ్యయనం చేశాకే నిర్ణయానికి వచ్చామని వెల్లడి
- భారత్‌కూ ఇవే వర్తిస్తాయని స్పష్టీకరణ
- ఆ దేశమే సుంకాలను చెల్లిస్తుందని, తమపై ఉండబోవని స్పష్టీకరణ
- మోదీ గొప్పవారని ప్రశంస




**వాళ్లు మూర్ఖులు**

'సుప్రీం కోర్టు జడ్జీలు మూర్ఖులు.. పెంపుడు శునకాల్లాంటివారు. దేశానికి ఏది మంచో అది చేయలేని అసమర్థులు' ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

న్యూయార్క్, వాషింగ్టన్: సుంకాల విషయంలో సుప్రీం కోర్టు షాకిచ్చినా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెనక్కి తగ్గడం లేదు. ప్రపంచ దేశాలపై శుక్రవారం 10 శాతం సుంకాలను విధించిన ఆయన.. వాటిని 15 శాతానికి పెంచుతానని శనివారం ప్రకటించారు. భారత్‌కూ 15 శాతమే వర్తిస్తాయని స్పష్టం చేశారు. వాస్తవానికి సుప్రీం తీర్పు తర్వాత తనకున్న అధికారాలతో అన్ని

- మిగతా2లో

# దేశ రాజధానికి ఉగ్ర ముప్పు

**నిఘా వర్గాల హెచ్చరికలు**




దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఉగ్ర దాడులు జరిగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఉగ్ర సంస్థ లష్కరే తయ్యిబా దిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్‌లోని వివిధ ప్రాంతాలే లక్ష్యంగా దాడులకు కుట్ర పన్నినట్లు వెల్లడించాయి. ఇందుకు భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను వినియోగించే అవకాశముందన్నాయి. దీంతో అప్రమత్తమైన భద్రతా సంస్థలు దిల్లీలో హైఅలర్ట్ ప్రకటించాయి. దేవాలయాలు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో అదనపు సిబ్బందిని మోహరించాయి. బాంబ్ స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి.

- మిగతా2లో

## కాంగ్రెస్ నిరసనలపై జగన్ ట్వీట్...

## "అమోఘం" అంటూ నారా లోకేశ్ కౌంటర్

- యూత్ కాంగ్రెస్ తీరు సిగ్గుచేటంటూ జగన్ విమర్శ
- జగన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన మంత్రి లోకేశ్
- గతంలో పెట్టుబడులను దెబ్బతీశారంటూ జగన్‌పై ఆరోపణలు
- జగన్ నకిలీ సానుభూతి ప్రదర్శిస్తున్నారని లోకేశ్ ఎద్దేవా



ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన తెలిపిన వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై వైసీపీ అధినేత జగన్ ట్వీట్ చేయడం తెలిసిందే. "ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రవర్తించిన తీరు సిగ్గుచేటు. మన రాజకీయాలు ఎటు వెళు తున్నాయి? రాజకీయ విభేదాలు ఎలా ఉన్నా, ప్రపంచం ముందు దేశం పరువు తీయకూడదు" అని జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. దేశం విషయంలో అందరం ఐక్యంగా నిలబడాలని హితవు పలికారు. జగన్ వ్యాఖ్యలపై

- మిగతా2లో

# ప్రజలకు మెరుగైన జీవనం అందిస్తాం

-మొదటిపేజీ తరువాయి

టెక్నాలజీతో సుపరిపాలన

పౌర సేవల్లో టెక్నాలజీ వినియోగానికి పెద్దపీట వేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. "దేశంలో ఏ రాష్ట్రం కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందించడం లేదు. త్వరలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో శిక్షణ ఇచ్చేందుకు ఏఐ ట్యూటర్‌ను తీసుకువస్తున్నాం. ఇటీవల బిల్ గేట్స్ కూడా రాష్ట్రానికి వచ్చి రైతులు టెక్నాలజీని వినియోగిస్తున్న తీరును చూసి ఆనందం వ్యక్తం చేశారు" అని గుర్తుచేశారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు.

**ఆరోగ్యానికి భరోసా, వ్యవసాయానికి చేయూత**

ప్రజల ఆరోగ్యం కోసం యూనివర్సల్ హెల్త్ పాలసీ తీసుకువస్తున్నామని, పేద కుటుంబాలకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా రూ.25 లక్షల వరకు చికిత్స ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. వ్యవసాయంలోనూ టెక్నాలజీని ప్రవేశపెట్టి సాగును సులభతరం చేస్తామన్నారు. రైతులు పండించే పంటలకు మార్కెట్ ధర అందేలా, సాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినుకొండను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే ఆలోచన ఉందన్నారు.

**స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా పటిష్ట చర్యలు**

స్వచ్ఛమైన వాతావరణం కల్పించడమే 'స్వచ్ఛాంధ్ర' లక్ష్యమని సీఎం అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ నేతృత్వంలో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా సాగుతోందన్నారు. "గత పాలకులు వదిలేసిన 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించే బృహత్తర కార్యక్రమం చేపట్టాం. మార్చి నాటికల్లా గ్రామీణ ప్రాంతాల్లో వందశాతం డోర్ టు డోర్ చెత్త సేకరణ పూర్తి చేస్తాం" అని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించామని, దీనివల్ల పశువులు, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని వివరించారు.

**చెత్త నుంచి సంపద.. మారాల్సిన తీరు**

చెత్తను సంపదగా మార్చే ప్రక్రియను ప్రోత్సహిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "విశాఖ, గుంటూరులలో చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లు ఉన్నాయి. రాజమండ్రితో పాటు మరో 5 ప్లాంట్లు త్వరలో ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో 4 లక్షలకు పైగా కుటుంబాలు హోం కంపోస్టింగ్ ద్వారా ఎరువు తయారు చేసుకుంటున్నాయి" అని ప్రశంసించారు. చెత్త నిర్వహణలో జపాన్ పౌరుల తరహాలో మన ఆలోచనా తీరు మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంపై మళ్లీ పిడుగు

-మొదటిపేజీ తరువాయి

దేశాలపై 10 శాతం సుంకాలను విధిస్తున్నట్లు శుక్రవారం ఆయన అధికారికంగా ప్రకటించి.. ఉత్తర్వులపై సంతకం చేశారు. ఈ నెల 24వ తేదీ నుంచి అవి అమల్లోకి వస్తాయని వెల్లడించారు. ఒక రోజు తిరిగేసరికల్లా 10 శాతం కాదు.. 15 శాతం విధిస్తామని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ ద్వారా ఆయన ప్రకటించారు. 'చట్టానికి నిలిచే విధంగానే 10 శాతం నుంచి 15 శాతానికి సుంకాలను పెంచుతాం. అమెరికాకు వ్యతిరేకంగా హాస్యాస్పదంగా, పేలవంగా రాసిన అసాధారణ కోర్టు తీర్పును సమగ్రంగా, వివరంగా పూర్తిగా సమీక్షించాకే సుంకాల పెంపుపై నిర్ణయానికి వచ్చాం' అని ట్రంప్ ప్రకటించారు. 'అమెరికా అధ్యక్షుడు చెప్పాలనుకున్న విషయాన్ని చెప్పడానికి అవకాశమివ్వండి. ప్రపంచ దేశాలపై విధించిన 10 శాతం సుంకాలను 15 శాతానికి పెంచుతాం. ప్రతీకార సుంకాల్లేకుండా ఎన్నో దశాబ్దాలుగా అమెరికాను దోచుకుంటున్న ఆయా దేశాలు ఇందులో ఉన్నాయి. చట్టానికి నిలిచేలా 15 శాతం స్థాయికి సుంకాలను తీసుకెళ్తాం' అని ట్రంప్ పేర్కొన్నారు. రానున్న కొద్ది నెలల్లోనే మరిన్ని సుంకాలను విధిస్తామని ప్రకటించారు.

సుప్రీం తీర్పు తర్వాతా ఏమీ మారలేదని, భారతే తమకు సుంకాలను చెల్లిస్తుందని, తాము ఎటువంటి సుంకాలను ఆ దేశానికి చెల్లించబోమని ట్రంప్ స్పష్టం చేశారు. తొలుత 10 శాతం సుంకాలపై శ్వేత సౌధం విడుదల చేసిన ఫ్యాక్ట్‌షీట్‌లో.. అమెరికా ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచే, భవిష్యత్తులో మరింత పకడ్బందీగా సుంకాలు విధించే అవకాశమున్న కొన్ని వస్తువులకు ఈ తాత్కాలిక సుంకాలు వర్తించబోవని పేర్కొంది.

**సుంకాలు వర్తించనివి..**

కరెన్సీ, బులియన్, ఇంధనం, ఇంధన ఉత్పత్తుల్లో ఉపయోగించే కొన్ని ప్రత్యేక కీలక ఖనిజాలు, లోహాలు.

పెరిగే, తవ్వితీసే అవకాశం లేని సహజ వనరులు, ఎరువులు.

బీఫ్, టమాటా, నారింజ వంటి కొన్ని వ్యవసాయ ఉత్పత్తులు.

ఔషధాలు, వాటిలో వాడే దినుసులు.

కొన్ని ఎలక్ట్రానిక్ వస్తువులు.

వ్యక్తిగత వాహనాలు, తేలికపాటి ట్రక్కులు, మధ్య, భారీ శ్రేణి వాహనాలు, బస్సులు, వ్యక్తిగత వాహనాల విడి భాగాలు, కొన్ని విమాన విడిభాగాలు.

**'మోదీ తెలివైనవారు'**

సుంకాలను విధిస్తానని హెచ్చరించి భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని ఆపానని మరోసారి ట్రంప్ పేర్కొన్నారు. ప్రధాని మోదీతో తనకు గొప్ప సంబంధాలున్నాయని తెలిపారు. 'ఏమీ మారదు. భారత్ సుంకాలను చెల్లిస్తుంది. మేం చెల్లించం. భారత్ చేసుకున్న ఒప్పందమే అలాంటిది. ప్రధాని మోదీ గొప్ప జెంటిల్‌మన్. అమెరికా విషయంలో నేను వ్యతిరేకించే వారి కంటే ఆయన తెలివైనవారు. ఆయన మమ్మల్ని చీల్చి చెండాడుతున్నారు. దీంతో మేం ఒప్పందం చేసుకున్నాం. ఇది పారదర్శక ఒప్పందం. కానీ వారే సుంకాలు చెల్లించేలా ఒప్పందాన్ని కాస్త తిప్పాం. భారత్‌తో నా సంబంధాలు అద్భుతంగా ఉన్నాయి. మా విజ్ఞప్తితో రష్యా నుంచి చమురును ఆ దేశం నిలిపేస్తోంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

# మద్యం స్కాంలో వాసుదేవరెడ్డి అరెస్టు

-మొదటిపేజీ తరువాయి

ప్రశ్నించినా.. కుంభకోణంలోని కీలకాంశాలపై నోరు విప్పలేదు. విచారణకు సహకరించలేదు. దీంతో మధ్యాహ్నం 2 గంటల సమయంలో వాసుదేవరెడ్డిని అరెస్టు చేశారు. ఆయన వద్ద రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి భాస్కర్‌రావు ఈ నెల 27వ తేదీ వరకూ రిమాండ్ విధించారు. వాసుదేవరెడ్డిని గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. వాసుదేవరెడ్డి ఈ కేసులో అప్రూవర్‌గా మారతారని మొదట్లో ప్రచారం జరిగింది. దర్యాప్తు అధికారులకు ఆయన సహకరించలేదు. పైగా ఆ ముసుగులో ముందస్తు బెయిల్ పొందేందుకు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వైకాపా మద్యం ముఠా తరఫున అన్నీ తానై కుంభకోణంలో కీలకంగా వ్యవహరించిన వాసుదేవరెడ్డిని సిట్ ఎట్టకేలకు అరెస్టు చేసింది. వాళ్ల సహకారం లేనిదే ఇంత అవినీతి సాధ్యం కాదు: 'బ్యూరోక్రాట్లు, రాజకీయ పలుకుబడితో ఉన్నత హోదాలు అనుభవించేవారు, తుది నిర్ణయాలు తీసుకునేవారి మధ్య నేరపూరిత కుట్ర, సహకారం, కుమ్మక్కు లేకుండా మద్యం కుంభకోణంలో రూ.3,500 కోట్ల భారీ అవినీతి సాధ్యం. ఇదేమీ చిన్న కేసు కాదు. సంబంధమున్న బ్యూరోక్రాట్లను అరెస్టు చేయకపోవటం దురదృష్టకరం. వారి పాత్ర లోతుగా ఉన్నా తప్పించుకున్నారేమో! బ్యూరోక్రాట్ల నేరపూరిత కుట్ర, కుమ్మక్కు లేకుండా ఇంతటి భారీ అవినీతి ఎలా సాధ్యం? రాజకీయ పక్షపాతంతో ఉన్నత స్థానాలు అనుభవిస్తున్నవారే తుది నిర్ణయాలు తీసుకునేవారికి సహకరిస్తున్నారు' అంటూ సుప్రీంకోర్టు ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి బెయిల్‌ను తిరస్కరిస్తూ ఈ మాటలు చెప్పింది. వాసుదేవరెడ్డిని అరెస్టు చేయలేదనే ప్రస్తావన వచ్చినప్పుడు ఈ నెల 5న సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. 'మద్యం కుంభకోణం శరీరమైతే వాసుదేవరెడ్డి దానికి తలలాంటి వారు. తల తీసేస్తే శరీరం మొత్తం కుప్పకూలిపోతుంది. ట్రంకు పెట్టెల కొద్దీ సాక్ష్యాధారాలు ఉన్నప్పుడు అతన్ని అప్రూవర్‌గా మార్చాల్సిన అవసరం లేదు. ముందస్తు బెయిల్ ఇస్తే తప్ప అప్రూవర్‌గా మారబోమనేలా కోర్టుతో బేరమాడుతున్నట్లు వాసుదేవరెడ్డి వ్యవహారశైలి ఉంది. రూ.3,500 కోట్ల ముడుపులు చేతులు మారిన ఇలాంటి తీవ్రమైన కేసులో ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వలేము' అంటూ కొన్ని నెలల కిందటే ఏసీబీ కోర్టు స్పష్టం చేసింది. దీంతో వాసుదేవరెడ్డి హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారు. ప్రస్తుతం ఆ పిటిషన్ అక్కడ పెండింగ్‌లో ఉంది.

# స్థానిక సంస్థల్లో పార్టీ బలం పెంచేలా సభ్యత్వ నమోదు

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. ఆయన పార్టీ సమన్వయకర్తలతో శనివారం సభ్యత్వ నమోదుపై టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను పార్టీ అధ్యక్షులే నియమించారన్నారు.

పార్టీకి సమయం కేటాయించాలి

"ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చట్టసభల సమావేశాలకు హాజరవుతూనే మిగిలిన సమయాన్ని పూర్తిగా పార్టీకి కేటాయించాలి. క్షేత్రస్థాయిలో నాయకత్వాన్ని బలోపేతం చేయాలి. స్థానికంగా దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తే పార్టీకి, ప్రభుత్వానికి మంచిపేరు వస్తుంది. ప్రతివారం నాయకులు సమావేశాలు ఏర్పాటుచేసుకుని ఎన్ని సభ్యత్వాలు చేశాం? ఇంకా ఎంత అవకాశముందో లెక్కలు వేసుకోవాలి. క్షేత్రస్థాయిలో పార్టీకి సానుకూలతలు, ప్రతికూలతలపై స్పష్టమైన అభిప్రాయాలు సేకరించి నివేదికలు ఇవ్వాలి" అని మనోహర్ తెలిపారు.

కొత్త సభ్యులే పార్టీకి బలం: పి.హరిప్రసాద్, ఎమ్మెల్సీ

"పార్టీలో కొత్త సభ్యులను చేర్చడమే అదనపు బలం. జెన్‌జీని పార్టీకి దగ్గర చేయాలి. గతంలో ప్రతి నియోజకవర్గం నుంచి ఇన్‌ఛార్జికే బాధ్యత ఉండేది. ఇప్పుడు పార్టీ అధ్యక్షుడు ప్రతి నియోజకవర్గంలో కీలకమైన ఇతర నాయకులను భాగస్వాములను చేసేలా నిర్ణయం తీసుకున్నారు. కిందటిసారి 12.6 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ ఏడాది రెట్టింపు కంటే అధికంగా పార్టీకి కొత్త సభ్యులను చేర్చాలి" అని హరిప్రసాద్ సూచించారు.

25 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జుల నియామకంసభ్యత్వ నమోదు కోసం 25 పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఇన్‌ఛార్జులను జనసేన పార్టీ నియమించింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి... శ్రీకాకుళం- కొరికాన రవికుమార్, విజయనగరం- లోకం నాగమాధవి, విశాఖపట్నం- వంశీకృష్ణ శ్రీనివాస్, అనకాపల్లి: పంచకర్ల రమేష్‌బాబు, అరకు- సుందరపు విజయకుమార్, కాకినాడ- తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, అమలాపురం: బత్తుల బలరామకృష్ణ, రాజమండ్రి- కందుల దుర్గేష్, నరసాపురం: చిల్లపల్లి శ్రీనివాసరావు, ఏలూరు: గిడ్డి సత్యనారాయణ, విజయవాడ: బొమ్మిడి నాయకర్, మచిలీపట్నం: వల్లభనేని బాలశౌరి, గుంటూరు: పిడుగు హరిప్రసాద్, నరసరావుపేట: పంతం నానాజీ, బాపట్ల: పత్సమట్ల ధర్మరాజు, ఒంగోలు: కొణతాల రామకృష్ణ, నెల్లూరు: బొలిశెట్టి శ్రీనివాస్, కడప: టి.సి.వరుణ్, రాజంపేట: కల్యాణం శివ శ్రీనివాసరావు, కర్నూలు: చిలకం మధుసూదన్‌రెడ్డి, నంద్యాల: కిలారు రోశయ్య, అనంతపురం: పి.హరిప్రసాద్, హిందూపురం: ఎస్.కె.రియాజ్, చిత్తూరు: వేగుళ్ల లీలాకృష్ణ, తిరుపతి: ఆరణి శ్రీనివాసులు.

# ఐదేళ్లలో చొరబాటుదారులనూ తరిమేస్తాం

-మొదటిపేజీ తరువాయి

పొందుతున్నట్లే.. అక్రమవలసదారుల ఏరివేత కూడా సాధ్యమే. చొరబాటుదారుల్ని వారు నివసిస్తున్న స్థలం నుంచి తరిమికొట్టడమే కాదు. వేరే చోట స్థిరపడకుండా దేశం నుంచి బయటకు పంపించాలి. అక్రమ వలసదారులను తరిమేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గతంలో చెప్పారు. కానీ వారు ఆ పని చేయరు. ఎందుకంటే వారే ఆ పార్టీ ఓటు బ్యాంకు" అని అమిత్ షా పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో ఈశాన్య భారత్‌లో అస్సాం పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు.

వచ్చేనెల 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలిస్తాం..

అంతకుముందు అమిత్ షా అస్సాంలో తొలిసారిగా జరిగిన సీఆర్పీఎఫ్ 87వ డే పరేడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చేనెల 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలిస్తామని వ్యాఖ్యానించారు. "మూడేళ్లలోనే మావోయిస్టుల వెన్నువిరిచి భద్రతా దళాలు గొప్ప విజయం సాధించాయి. 12 ఏళ్ల క్రితం ఉగ్రవాదంతో జమ్మూకశ్మీర్, నక్సలిజం, తిరుగుబాటుతో ఈశాన్య రాష్ట్రాలు భయం గుప్పిట్లో ఉండేవి. ఇప్పుడు అవి శాంతి, పురోగతికి కేంద్రాలుగా మారుతున్నాయి. సీఆర్పీఎఫ్ జవాన్ల త్యాగాలు లేకుండా ఈ ప్రాంతాల్లో అభివృద్ధి సాధ్యమయ్యేది కాదు. అస్సాంలో శాంతిని నెలకొల్పేందుకు 79 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణత్యాగం చేశారు. శౌర్యపరాక్రమాలు, దేశభక్తిలో సీఆర్పీఎఫ్ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది" అని అమిత్ షా ప్రశంసించారు.

# ఖనిజ రంగంలో సహకారానికి భారత్-బ్రెజిల్ ఒప్పందం

-మొదటిపేజీ తరువాయి

ఇరు దేశాలు కీలక ఖనిజాల రంగంలో సహకారం ఇచ్చిపుచ్చుకునేందుకు ఉద్దేశించిన ఒప్పందంపై సంతకాలు చేశాయి. అనేక ద్వైపాక్షిక అంశాలతోపాటు, ట్రంప్ సుంకాలను రద్దుచేస్తూ అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు పర్యవసానాలపై లులా, మోదీ చర్చించుకున్నారు. రక్షణ, ఇంధనం, వైద్యసేవ, డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటి అనేక ఇతర రంగాల్లోనూ సంబంధాలను బలోపేతం చేయాలని ఇరుదేశాల నేతలూ నిర్ణయించారు. ఉగ్రవాదం, దానికి మద్దతునిచ్చేవారు మానవాళికి శత్రువులన్న విషయంపై భారత్, బ్రెజిల్ ఏకాభిప్రాయానికి వచ్చాయని మోదీ అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రదాడుల్ని బ్రెజిల్ అధ్యక్షుడు ఖండించారు. అయితే ఏ మతానికీ, జాతికీ ఉగ్రవాదంతో లంకె పెట్టకూడదని అభిప్రాయపడ్డారు. ఏఐ సదస్సులో పాల్గొనడంతో పాటు మోదీతో చర్చల కోసం లులా ఈ నెల 18న భారత్‌కు వచ్చారు.

**గణాంకాలు కాదు.. విశ్వాసానికి ప్రతీక**

భారత్-బ్రెజిల్ వాణిజ్య సహకారం కేవలం గణాంకాలకు పరిమితం కాదని, అది ఇరుదేశాల పరస్పర విశ్వాసానికి ప్రతీక అని లులా సమక్షంలో విడుదల చేసిన ప్రకటనలో మోదీ పేర్కొన్నారు. కృత్రిమ మేధ, సూపర్ కంప్యూటర్లు, సెమీ కండక్టర్లు వంటి రంగాల్లో పరస్పర సహకారానికి ఇరు దేశాలూ ప్రాధాన్యం ఇస్తున్నాయని చెప్పారు.

# దేశ రాజధానికి ఉగ్ర ముప్పు

ఈ నెల 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారంగా, భారత్‌లోని ప్రముఖ ధార్మిక స్థలాలపై దాడులు చేయాలని లష్కరే ప్లాన్ చేస్తోందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే సమాచారమివ్వాలని పోలీసులు స్థానికులను కోరారు. గతేడాది ఎర్రకోట వద్ద జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో.. నిఘా వర్గాల హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు

## కాంగ్రెస్ నిరసనలపై జగన్ ట్వీట్... "అమోఘం" అంటూ నారా లోకేశ్ కౌంటర్

-మొదటిపేజీ తరువాయి

మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. అసలు దేశ ప్రతిష్ఠ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదంటూ విరుచుకుపడ్డారు. జగన్ హిపోక్రసీ (కపటత్వం) అమోఘమని లోకేశ్ ఎద్దేవా చేశారు. "భారతదేశ పెట్టుబడుల వాతావరణాన్ని అందరికంటే ఎక్కువగా దెబ్బతీసిన వ్యక్తి, ఇప్పుడు నకిలీ సానుభూతి ప్రదర్శిస్తున్నారు" అని విమర్శించారు. ఈ సందర్భంగా జగన్ గతంలో తీసుకున్న పలు నిర్ణయాలను లోకేశ్ ప్రస్తావించారు. 2017లో ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను అడ్డుకునేందుకు ఎయిర్‌పోర్టులో ధర్నా చేయడం, 2019లో విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయడం, 2020లో అమరావతిలో సింగపూర్ ప్రభుత్వ పెట్టుబడులను వెనక్కి పంపడం, 2025లో ప్రభుత్వ నిధుల సమీకరణను అడ్డుకోవాలని ఆర్‌బీఐకి లేఖ రాయడం వంటి చర్యలను గుర్తుచేశారు. ఇప్పుడు ఏఐ సమ్మిట్ గురించి ఆందోళన చెందుతున్నట్లు నటించడం విడ్డూరంగా ఉందని లోకేశ్ వ్యాఖ్యానించారు.

## కాంగ్రెస్ నేతలు బట్టలు విప్పి తిరగడం దారుణం

-మొదటిపేజీ తరువాయి

తనను తీవ్రంగా ఆవేదనకు గురిచేసిందని అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని 60కి పైగా దేశాలు తమ ఆవిష్కరణలతో పాల్గొన్న అంతర్జాతీయ సదస్సులో ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన ఈ పనులు దేశ ప్రతిష్ఠకు నష్టం కలిగిస్తాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. టెక్నాలజీని స్వాగతించాల్సింది పోయి, ఇలాంటి నిరసనలు చేయడం దారుణమని పేర్కొన్నారు.తాను ఇటీవల ఢిల్లీ ఏఐ సదస్సుకు హాజరయ్యానని, వైద్యం, విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో టెక్నాలజీ వినూత్న మార్పులు తీసుకురాబోతోందని వివరించారు. టెక్నాలజీని ప్రజల మేలు కోసం వినియోగించడం తనకు అలవాటని స్పష్టం చేశారు. రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, విశాఖలో గూగుల్ డేటా సెంటర్, అమరావతిలో క్వాంటం కంప్యూటర్ త్వరలో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. వ్యవసాయంలోనూ టెక్నాలజీని తీసుకొచ్చి సాగును సులభతరం చేస్తామని హామీ ఇచ్చారు.

## కర్ణాటకలో రూ.5 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడిన బీజేపీ ఎమ్మెల్యే

రహదారి పక్కన గోడ నిర్మించడంతో కాంట్రాక్టర్ నుంచి రూ.11 లక్షలు డిమాండ్

తన ఆసుపత్రిలో రూ.5 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న లోకాయుక్త

ఎమ్మెల్యేతో పాటు ఇద్దరు సహాయకులను అరెస్టు చేసినట్లు తెలిపిన లోకాయుక్త



కర్ణాటకలో కాంట్రాక్టర్ నుంచి రూ.5 లక్షలు లంచం తీసుకుంటుండగా లోకాయుక్త పోలీసులు ఒక బీజేపీ ఎమ్మెల్యేను పట్టుకున్నారు. గదగ జిల్లా శిరహట్టి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ చంద్రు లమాణి లంచం తీసుకుంటూ లోకాయుక్తకు చిక్కారు. రహదారి పక్కన గోడ నిర్మించిన విజయ్ పూజార్ అనే కాంట్రాక్టర్ నుంచి ఎమ్మెల్యే రూ.11 లక్షలు డిమాండ్ చేశారు.దీంతో విజయ్ పూజార్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లక్ష్మేశ్వరపురలోని తన ఆసుపత్రిలోనే ఎమ్మెల్యే రూ.5 లక్షలు లంచం తీసుకుంటుండగా ఎమ్మెల్యేతో పాటు అతడి ఇద్దరు సహాయకులు మంజునాథ్ వాల్మీకి, గురునాయక్‌లను అరెస్టు చేశారు.మైనర్ ఇరిగేషన్ శాఖ కింద ఉన్న రోడ్డులో గోడ నిర్మించడంతో, దీనికి క్లియరెన్స్ ఇవ్వడానికి ఎమ్మెల్యే కాంట్రాక్టర్ నుంచి రూ.11 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు లోకాయుక్త తెలిపింది. దార్వాడ లోకాయుక్త ఎస్పీ సిద్ధలింగప్ప నేతృత్వంలో అధికారులు, సిబ్బంది దాడిలో పాల్గొన్నారు.నగదు డిమాండ్ చేస్తూ విజయ్‌కు చేసిన ఫోన్ కాల్ ఆడియో ఆధారంగా ఎమ్మెల్యేపై నిఘా పెట్టారు. అవినీతి నిరోధక చట్టం, 1988 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే అరెస్టుకు సంబంధించిన సమాచారాన్ని అసెంబ్లీ స్పీకర్‌కు ఇచ్చారు.ఈ అరెస్టుపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. లంచం తీసుకుంటుండగా ఎమ్మెల్యే లమానీని లోకాయుక్త పట్టుకుందని అన్నారు. బీజేపీ నాయకులు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఇతరులపై అవినీతి, లంచం ఆరోపణలు చేయడం సులభమని కానీ ఇప్పుడు వారి ఎమ్మెల్యేనే పట్టుబడ్డారని అన్నారు.

# స్వామివారి వార్షిక కల్యాణోత్సవం పై హోం మంత్రి సమీక్ష





- వెంకటేశ్వర స్వామి దర్శించుకున్న హోం మంత్రి అనిత
- ఉత్సవాల ఏర్పాట్లపై దిశా నిర్దేశం

**నక్కపల్లి, పెన్ సత్తా ఫిబ్రవరి 21:** ఉపమాక శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వారిని శనివారం హోంమంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈనెల 27న జరగనున్న ఉపమాక శ్రీ వెంకటేశ్వర స్వామివారి వార్షిక కళ్యాణం నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో ఆలయ సిబ్బంది, అధికారులు నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్తరాంధ్ర తో పాటు ఇతర జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు రానున్నందున, తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఆలయం వద్ద వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గరుడాద్రి పర్వతం పై స్వామివారిని దర్శించుకునే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వార్షిక కళ్యాణం ఏర్పాట్లను పరిశీలించారు. శ్రీవారి పుష్కరిణిని లో ఏషియన్ పెయింట్స్ సంస్థ చేపడుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. స్వామివారి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను దిశానిర్దేశం చేశారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనం, ప్రసాదం భక్తుల విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. దేవుడిని రాజకీయాల్లో వాడుకోవడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. తిరుమల తిరుపతి లడ్డూ విషయంలో కల్తీ జరిగిందని నివేదికల్లో స్పష్టమైందని మంత్రి పేర్కొన్నారు. లడ్డూలో నెయ్యి లేకపోవడం కూడా బయట పడిందని తెలిపారు. లడ్డుకు సరఫరా చేసిన నెయ్యికి సంబంధించి రూ. 240 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. చెప్పులు వేసుకుని దేవుడి చిత్రపటాలతో అసెంబ్లీలోకి రావడం మహా అపచారమని విమర్శించారు. అన్ని కులాలు, మతాల వారు ఈ ఘటనను ఖండిస్తున్నారని, ప్రజలందరూ తీవ్రంగా స్పందించాలని పిలుపునిచ్చారు. తిరుపతి లడ్డూ విషయంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల టిడిపి నాయకులు గింజాల లక్ష్మణరావు, పిఎసిఎస్ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, కురందాసు నూకరాజు, వెలగా శ్రీనివాసరావు, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ మురళి, ఎస్సై సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.





# నియోజకవర్గంలో అనితమ్మ క్రికెట్ టోర్నమెంట్

గోడ పత్రికలను ఆవిష్కరించిన నాయకులు



**నక్కపల్లి, పెన్ సత్తా ఫిబ్రవరి 21:** రాష్ట్ర హోం మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి వంగలపూడి అనిత జన్మదినాన్ని పురస్కరించుకుని అనితమ్మ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు శనివారం నిర్వాహకులు తెలిపారు. మార్చి మొదటి వారంలో మ్యాచ్‌లు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతిగా లక్ష నగదు, రెండో బహుమతిగా 50 వేల రూపాయల నగదు అందజేయడం జరుగుతుందని తెలిపారు. టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు ప్రకటించారు. ఈ క్రీడల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడికి టీ షర్టు కూడా ఇవ్వబడతాయని గ్రామాల ప్రాతి పదికన క్రికెట్ జట్లు ఏర్పడి ఈ టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక హెటిరో క్రీడా మైదానంలో మ్యాచ్‌లు జరుగుతాయి అన్నారు. ఈ సందర్భంగా నక్కపల్లి మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద టోర్నమెంట్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 21:** పది విద్యార్థుల పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిచారించారు. నైట్ విజిట్స్ లో భాగంగా ఎన్. నరసాపురం, బుచ్చి రాజుపేట,రాజయ్యపేట గ్రామాలలో శనివారం రాత్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నక్కపల్లి లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల ఇండ్లను సందర్శించి తెలుగు ఉపాధ్యాయులు టి. వి. రమణ, ఎం. సత్యనారాయణ లు తల్లిదండ్రులు, విద్యార్థులతో మాట్లాడి విద్యార్థులు ను బాగా చదివించాలని పలు సూచనలు, సలహాలు అందించారు. కష్టపడి చదివి పబ్లిక్ పరీక్షల లో ఉత్తమ ప్రతిభ సాదించాలని ఆకాంక్షించారు.



# రైతులు విశాఖ డెయిరి సేవలు వినియోగించుకోవాలి



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 21:** పాడి రైతులు విశాఖ డెయిరి అమలు చేసే సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని కాగిత పాల ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షులు పోతంశెట్టి గోవిందరావు అన్నారు. శనివారం కాగిత పాల కేంద్రానికి పాలు సరఫరా చేస్తున్న పాడి రైతు సగుర్తి బుల్లిరాజు పాడి పశువు ఇటీవల మరణించింది. రైతు యొక్క పశువుకు విశాఖ డెయిరి పశు బీమా పథకం ద్వారా రూ. 40వేలు ఆర్థిక సాయం పాడి రైతు బుల్లి రాజుకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు గోవిందరావు మాట్లాడుతూ విశాఖ డెయిరి పాడి రైతులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. డెయిరి సేవలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేతన కార్యదర్శి శివ, రైతులు మారెడ్డి రమణ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## పదిలో శత శాతం ఉత్తీర్ణత బాధ్యత ఉపాధ్యాయులదే

డివైఈవో పెన్నాడ అప్పారావు





**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 21:** ఈ ఏడాది మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థుల శత శాతం ఉత్తీర్ణత బాధ్యత ఉపాధ్యాయులదేనిని ఎలమంచిలి డివిజన్ జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పెన్నాడ అప్పారావు అన్నారు. మండలంలో జానకయ్యపేట హైస్కూలును శనివారం ఆయన సందర్శించారు .10వ తరగతి విద్యార్థుల 100 రోజుల కార్యాచరణ, ప్రణాళిక ఎలా అమలవుతుందో పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులను ఆయా అంశాలపై పలు ప్రశ్నలు వేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఇంక 23 రోజులు మాత్రమే పరీక్షలకు సమయం ఉండడంతో ప్రతి ఉపాధ్యాయుడు వెనుకబడిన విద్యార్థులపై దృష్టి కేంద్రీకరించి మంచి ఫలితాలు సాధించాలని ఆయన అన్నారు. ముఖ్యంగా రాత్రి వేళలలో హెచ్ఎం బషీర్ ఖాన్ ఆధ్వర్యంలో రాత్రివేళ తరగతులను నిర్వహిస్తున్నామని హెచ్ఎం మాట్లాడగా డివైఈవో పెన్నాడ అప్పారావు ఆయనను అభినందించారు. మంచి ఫలితాలు సాధనకు ఉపాధ్యాయులు అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## వెనకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 21:** పదవ తరగతిలో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ కె.నరేష్ అన్నారు.మండలంలో నక్కపల్లి హై స్కూల్ కేంద్రంగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు శనివారం హెచ్.ఎమ్. కాంప్లెక్స్ చైర్మన్ పతివాడ విజయ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు హాజరయ్యారు.ఈ సమావేశాలను స్థానిక మండల విద్యాశాఖ అధికారి 1 కె.నరేష్ ఎం ఈ ఓ 2 రుత్తల నాగన్న దొర ,నోడల్ హెచ్ ఎం వేమగిరి నాగరాజు పరిశీలించారు. వేంపాడు,గొడిచర్ల , చినదొడ్డిగల్లు ఉన్నత పాఠశాలలో కూడా హెచ్ఎం వి బాలాజీ, సత్యారావు,వరలక్ష్మి ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి వందరోజుల కార్యాచరణ ప్రణాళిక పై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. రిసోర్స్ పర్సన్ ల తో వెనుకబడిన విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా చర్చించాలన్నారు.

# తప్పిన పెను ప్రమాదం



**పెన్ సత్తా,ఫిబ్రవరి 21:**టేక్మాల్ మండలంలోని ఎల్లుపేట ప్రధాన రహదారిపై శనివారం ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా కొల్చారం గ్రామానికి చెందిన (ఏడిటి) 9192గల లారి పశువుల మేత కొరకు టేక్మాల్ మండల పరదిలోని ఏల్లుపేట గ్రామ శివారులో పశువుల మేత 350 మోపులు నింపుకొని ప్రధాన రోడ్డుకు వెళ్తున్న సమయంలో ఎల్లుపేట రహదారి వద్ద లారీకి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, కర్రల సహాయంతో గడ్డిని లారీ నుంచి బయటకు తోసివేసి పెను ప్రమాదాన్ని తప్పించారు. మంటలు భారీగా చెలరేగాడంతో సుమారు కిలోమీటర్లు మేర గడ్డి మేపులు రోడ్డుకు ఇరువైపులా పడేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు రెండు లక్షల రూపాయలు ఆస్తి నష్టం జరిగినట్లు లారి డ్రైవర్ నాగరాజు తెలిపారు.నల్లకుంట తాండకు చెందిన సేవాలాల్ యూత్ సభ్యులు జేసీబీ సహాయం మంటలు అదుపులోకి తీసుకోని అర్పారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కాకపోవడంతో వారిని చికిత్స నిమిత్యం పాపానపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


## వైభవంగా శ్రీ వేంకటేశ్వరస్వామి గరడసేవ

- జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వరుడు దర్శనంతో తన్మయత్వంలో భక్తులు.
- విశేషంగా తరలివచ్చిన భక్తులు.
- టీటీడీ ఏర్పాట్లపై భక్తుల ప్రశంస.
- మోహినీ అవతారంలో జగన్మోహనాకారుడు.



**హైదరాబాద్ సికింద్రాబాద్ సిటీ బ్యూరో పెన్ సత్తా,ఫిబ్రవరి 21:**జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం ఉదయం 8 నుండి 9 గంటల వరకు మోహినీ రూపంలో శృంగార రసాధి దేవతగా సర్వాలంకార భూషితుడై శ్రీనివాసుడు పల్లకీలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ అవతారం మాయా మోహ నాశనం.రాత్రి 7 గంటల నుండి 9 గంటల వరకు గరుడవాహనం శ్రీవారి దర్శనం. గరుడ వాహనం సర్వపాప ప్రాయశ్చిత్తం.పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా దాస ప్రపత్తికి తాను దాసుడనని తెలియజెబుతారు. అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే భగదధిష్టుతుడైన గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియచేస్తున్నారు.ఈ వాహనసేవలో టీటీడీ జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వర టెంపుల్ లోకల్ అడ్వైసరీ కమిటీ ప్రెసిడెంట్ ఏ వేంకటేశ్వరా రెడ్డి, హైదరాబాద్ టీటీడీ ఎఈఓ యూ రమేష్,ఆలయ అర్చకులు, టెంపుల్ ఇన్పెక్టర్స్ నిరంజన్, హరికృష్ణ, మాజీ లోకల్ అడ్వైసరీ కమిటీ మెంబర్ ఏవి రమణారెడ్డి, పలువురు అధికారులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వార్డు సభ్యులకు ఐదు రోజుల శిక్షణ పూర్తి..




**అబ్దుల్లాపూర్మెట్, పెన్ సత్తా,ఫిబ్రవరి 21:**స్థానిక స్వపరిపాలన బలోపేతం లక్ష్యంగా అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యాలయంలో నిర్వహించిన వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఫిబ్రవరి 17 నుంచి 21 వరకు ఐదు రోజులపాటు సాగిన ఈ శిక్షణలో మొత్తం 133 మంది వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హాజరై వారికి సర్టిఫికెట్లు అందజేశారు. గ్రామపంచాయతీ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, ప్రభుత్వ పథకాల సమర్థ అమలు విధానం, నిధుల వినియోగం, ఆర్థిక నిర్వహణ వంటి కీలక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. గ్రామ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారంలో వార్డు సభ్యుల పాత్ర ఎంత ముఖ్యమో నిపుణులు వివరించారు. శిక్షణ ముగింపు సందర్భంగా పాల్గొన్న వార్డు సభ్యులు కలిసి ఎంపీడీఓ, శిక్షణ అందించిన ట్రైనింగ్ అధికారులను (టీఓటీలు) సన్మానించారు. ఈ శిక్షణ తమకు ఎంతో ఉపయోగపడిందని, గ్రామాభివృద్ధికి మరింత చైతన్యంతో పనిచేస్తామని వార్డు సభ్యులు పేర్కొన్నారు.

# దేవుడితో వైసీపీ నీచ రాజకీయం

- జగన్ మోహన్ రెడ్డికి,వైసీపీ నేతలకు దేవుడంటే భక్తి లేదు, భయం లేదు
- హిందూవుల మనోభావాలంటే లెక్కేలేదు
- బాపట్ల శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు




**బాపట్ల,పెన్ సత్తా,ఫిబ్రవరి 21:**మాజీ ముఖ్యమంత్రి,వైసీపీ అధ్యక్షులు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి డైరెక్షన్ లో వైసీపీ నేతలు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి ఫోటోలను చెప్పులు,షూలు వేసుకుని శాసనమండలిలో నినాదాలు చేస్తూ రాజకీయం చేసే నీచానికి దిగారని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు.శనివారం బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.....అధికారంలో ఉన్నప్పుడు చట్టసభలను బూతులు,వెకిలివేషాలకు కేంద్రాలుగా మార్చారని విమర్శించారు.ఇప్పుడు ఏకంగా దేవుడి ఫోటోలతో దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారన్నారు.హిందూమత విశ్వాసాల పట్ల,తిరుమల తిరుపతి దేవస్థానం సంప్రదాయాలు,సంస్కృతి పట్ల జగన్ మోహన్ రెడ్డికి ముందు నుంచి చిన్నచూపు ఉందని అన్నారు.పరమపవిత్రమైన వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని జంతు కొవ్వు,ప్రమాదకర రసాయనాలతో కల్తీ చేశారని అన్నారు.టీటీడీ ఆస్తులను రాజకీయ అవసరాలకు గత ఎన్నికల్లో ఉపయోగించుకున్నారని తెలిపారు.టీటీడీ నిధులను దారి మళ్లించి,తిరుపతి నగరపాలక సంస్థ పేరిట కోట్ల రూపాయలు దోచుకున్నారని అన్నారు.వైసీపీ ఎమ్మెల్యేలు,ఎంపీలు,మంత్రులు కలిసి వీఐపీ బ్రేక్ మరియు సేవా టికెట్లను అమ్ముకున్నారని విమర్శించారు.వైసీపీ హయాంలో 300 లకు పైగా దేవాలయాలపై దాడులు,విగ్రహాల ధ్వంసం ఘటనలు జరిగాయన్నారు. ఆదాయ వనరుగా టీటీడీని మార్చుకుని రాజకీయ అవసరాలకు వాడుకున్నరన్నారు.తిరుపతి వెంకటేశ్వరస్వామితో ఆటలు ఆడారు కాబట్టే గత ఎన్నికలలో 11 సీట్లకు పరిమితం అయ్యారని చెప్పారు.అయినా జగన్ మోహన్ రెడ్డికి,వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదన్నారు. జగన్ మెహన్ రెడ్డికి,వైసీపీ నేతలకు దేవుడంటే భక్తి,భయం లేదన్నారు.తిరుపతి వెంకటేశ్వరస్వామిని కూడా రాజకీయాలకు వాడుకునే స్థాయికి వైసీపీ నేతలు దిగజరరాని విమర్శించారు.ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు,బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు,టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాత జయప్రకాశ్ నారాయణ,జనసేన పార్టీ బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ,బీజేపీ బాపట్ల పట్టణ అధ్యక్షులు బ్రంహ్మండం బాలనారాయణ,టీడీపీ నాయకులు కూచిపూడి శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# శాసనమండలిలో వైసీపీ తీరును హిందూ సమాజం ఖండించాలి

**జనసేన నాయకులు కామిశెట్టి సాయిబాబు**






**బాపట్ల,పెన్ సత్తా, ఫిబ్రవరి 21:**శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీల తీరును హిందూ సమాజం ఖండించాలని జనసేన పార్టీ నాయకులు కామిశెట్టి సాయిబాబు అన్నారు.దేవుడి విగ్రహాలు పగలగొడతారు,దేవుడి ప్రసాదం కల్తీ చేస్తారు,దేవుడిని అపవిత్రం చేస్తారు,మళ్ళీ దేవుడి ఫోటోలను రాజకీయ లబ్ది కోసం వాడుకుంటారని మండిపడ్డారు.శాసనమండలిలో వైసీపీ ఏమ్మెల్సీలు చెప్పులు,బూట్లు వేసుకుని తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఫోటోలతో నిరసనకు దిగడం మహాపాపమన్నారు.మాజీ ముఖ్యమంత్రి,వైసీపీ అధినేత వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి కళ్లల్లో ఆనందం కోసం వారు ఈ విధంగా ప్రవర్తించడం అత్యంత దారుణమని అన్నారు.జగన్ మోహన్ రెడ్డికి,ఆయన కుటుంబానికి హిందూ ధర్మం అన్నా,హిందూ దేవుళ్ళన్నా గౌరవం లేదన్నారు. హిందూవుల మనోభావాలు దెబ్బతిసేలా శాసనమండలిలో వైసీపీ చర్యలు ఉన్నాయని తెలిపారు.హిందూ సమాజానికి జగన్ మోహన్ రెడ్డి తక్షణమే క్షమాపణలు చెప్పాలన్నరు.మా నాయకుడు పవన్ కళ్యాణ్ మాకు అన్ని మతాలను గౌరవించాలని చెప్పారన్నారు.అదే సమయంలో మన ధర్మాన్ని కాపాడేందుకు బలంగా నిలబడాలని చెప్పారని తెలిపారు.జనసేన అధ్యక్షులు,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతి ధర్మాన్ని గౌరవిస్తారు కాబట్టే పొరుగున ఉన్న మహారాష్ట్రలో సిక్కులు తమ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించారని అన్నారు.

# భద్రత ప్రమాణాలు పాటించని బృందావన్ రసాయన కంపెనీపై చర్య తీసుకోవాలి.

**పర్యావరణాన్ని ప్రభుత్వం రక్షించాలి.**




**వలిగొండ మండలం పెన్ సత్తా,ఫిబ్రవరి 21:**ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐ లు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడివెంకటట్ రెడ్డి డిమాండ్

యాదాద్రి భువనగిరి జిల్లాలో నెలకొల్పబడినటువంటి కంపెనీలలో భద్రత ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యం చేస్తూ కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, బృందావన్ రసాయన కంపెనీలపై కంపెనీ కంట్రోల్ బోర్డు తక్షణమే ఇన్స్పెక్షన్ చేసిచర్యలు తీసుకోవాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ ఐ లు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడివెంకటట్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బోల్లేపల్లి కుమార్,జిల్లా ఉపాధ్యక్షులు తడక మోహన్, లు డిమాండ్ చేశారు ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూప్రమాద ఘటనలో చౌటుప్పల్ మండలం బృందావన్ కంపెనీ పేలుళ్లలో ఎవరు చనిపోలేదని యాజమాన్యం చెప్పున్నదని కానీ ఘటన స్థలంలో పెద్ద పెద్ద శిధిలాలు ఇండ్లకు కంపెనీకి పగుళ్లు ఉన్నాయని, డ్యూటీలో ఉన్న కార్మికులు ప్రమాదానికి గురైన కార్మికుల సమాచారాన్ని బహిర్గత పర్చాలని డిమాండ్ చేశారు. కొంత మందికి గాయాలు అయినట్టు తెలుస్తున్నదని వారి వివరాలను సైతం బహిర్గత పర్చాలని డిమాండ్ చేశారు.

సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటన మరవక ముందే రాష్ట్రంలో ఈ లాంటి ఘటనలు పునరావృతం జరుగుతున్న ప్రభుత్వం ,అధికారులు పరిశ్రమలో తనికులు నిర్వహించడం లేదని విమర్శించారు.

ఘటన జరిగక ముందే కార్మిక శాఖ అధికారులు , ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తనికులు నిర్వహించి ఉంటే ఇలాంటి ఘటనలు జరిగేవి కావని అధికారుల అలసత్వం వహిస్తున్నారని ,ప్రమాదం బాధ్యత మర్చిందని విమర్శించారు.

ప్రమాద ఘటన నుండి కోలుకొని పరిశ్రమ నడిచే వరకు పరిశ్రమలో పనిచేస్తున్న 200 మంది కార్మికులకు వేతనం యాజమాన్యమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పరిశ్రమ చుట్టుపక్కల గ్రామాలైన అంతమమ్మ గూడెం ,ధర్మోజీగూడెం గ్రామాలలో ప్రమాద శబ్దానికి ప్రజలు బయటికి పరుగులు తీశారని ,ఇళ్ళలో పగుళ్లు వచ్చాయని వీటన్నిటికి బాధ్యత యాజమాన్యం వహించాలని డిమాండ్ చేశారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని బృందావన్ రసాయన పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చౌటుప్పల్ ప్రాంతంలో 20 వేలకు పైగా వలస కార్మికులు ఉన్నారని ప్రభుత్వం సర్వే చేసి కార్మికులకు భరోసా ఇవ్వాలని ,పరిశ్రమలలో పనిచేసే కార్మికుల సమాచారం బహిర్గత పర్చాలని డిమాండ్ చేశారు.

# గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి.

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 21:** గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి గ్రామపంచాయతీ సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేసే దిశగా సమగ్ర ప్రణాళికతో కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు. శనివారం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఇనిస్ట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పాత క్యాంపస్ నందు నిర్వహించిన రెండవ విడత నూతన సర్పంచుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచులకు దిశానిర్దేశం చేశారు.

జిల్లాలోని అశ్వరావుపేట, దమ్మపేట, దుమ్ముగూడెం, ములకలపల్లి, జూలూరుపాడు, టేకులపల్లి, ఇల్లందు, లక్ష్మీదేవిపల్లి మండలాలకు చెందిన మొత్తం 233 మంది నూతన సర్పంచులకు 17-02-2026 నుండి 21-02-2026 వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడినట్లు కలెక్టర్ తెలిపారు

సర్పంచులు పంచాయతీరాజ్ చట్టంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, గ్రామస్థాయిలో ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు చట్టబద్ధమైన అధికారాలు మరియు బాధ్యతలను సముచితంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. శిక్షణ కార్యక్రమంలో గ్రామ పంచాయతీల పరిపాలన విధానం, గ్రామాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికల రూపకల్పన, బడ్జెట్ నిర్వహణ, ఆర్థిక పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం, సామాజిక బాధ్యత వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించబడినట్లు తెలిపారు.



ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, సామాజికాభివృద్ధి, పేదరిక నిర్మూలన తదితర సంక్షేమ కార్యక్రమాలు గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలవ్వాలంటే సర్పంచులు నాయకత్వ లక్షణాలతో ముందుండాలని ఆయన అన్నారు. గ్రామాల్లో ప్రాథమిక సదుపాయాల కల్పన, శుద్ధి త్రాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, విద్యుత్ సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం కార్యాచరణలో పెట్టి, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సర్పంచులందరూ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. శిక్షణ పూర్తిచేసుకున్న సర్పంచులకు ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు అందచేశారు .

కార్యక్రమం ముగింపు సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు జిల్లా కలెక్టర్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సుధీర్, శిక్షణ డీపీఓ అనూష, డీఎల్పీఓలు ప్రభాకర్, రమణ, టీజీఐఆర్డీ సెంటర్ హెడ్ సుభాష్ చంద్ర గౌడ్, ట్రైనర్లు బన్సింగ్, రవీందర్ రెడ్డి, సునీల్ కుమార్, ముత్యాలరావు, హజ్రత్ వలి, ఏపీవో రంగ, ఎస్‌బీఎం రేవతి, డిటిఎం సందీప్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మీడియా మిత్రులు.



**చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 21: ప్రతినిధి.** ఖమ్మం ఏసిపిసాంబరాజు, కోమల దంపతుల కుమార్తె స్వప్న ఖమ్మం సప్తపది ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహ వేడుకలో విశ్రాంత ఉపాధ్యాయులు అంబటి శాంతయ్య, సీనియర్ పాత్రికేయులు వార్త రిపోర్టర్ గార్లపాటి రమేష్,సీనియర్ పాత్రికేయులు నన్నక అప్పారావు, సీకే న్యూస్ రిపోర్టర్ గుడిది పిచ్చయ్య, మెట్రో ఉదయం రిపోర్టర్ గంటేలతిరుపతా చారి లు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## మీసేవ సర్టిఫికెట్ వెరిఫికేషన్ మొబైల్ యాప్‌పై జిల్లాస్థాయి శిక్షణ.




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 21:** జిల్లాలో మీసేవ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు సమయపాలనతో సేవలు అందించడమే లక్ష్యంగా ఐడీఓసి కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం జిల్లాలోని నయాబ్ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, జీపీవోలకు మీసేవ సర్టిఫికెట్ వెరిఫికేషన్ మొబైల్ యాప్ వినియోగం పై శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని జిల్లా ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ మాట్లాడుతూ, మీసేవ కేంద్రాల్లో స్వీకరించే దరఖాస్తులను వేగవంతంగా మరియు పారదర్శకంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మీసేవ ఫీల్డ్ వెరిఫికేషన్ మొబైల్ యాప్ వినియోగం అత్యంత కీలకమని తెలిపారు. యాప్ ద్వారా క్షేత్రస్థాయిలోనే ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేసి తక్షణమే పోర్టల్‌కు అప్‌డేట్ చేయవచ్చని వివరించారు.

క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా అధికారులు దరఖాస్తుదారుల నివాసానికి వెళ్లి సంబంధిత వివరాలను యాప్‌లో నమోదు చేయడం, జియో-ట్యాగ్‌తో కూడిన లైవ్ ఫోటోలను అప్‌లోడ్ చేయడం వల్ల నకిలీ దరఖాస్తులకు అవకాశం లేకుండా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. భౌతిక ఫైళ్ల కదలిక అవసరం లేకుండా పూర్తిగా డిజిటల్ విధానంలోనే పరిశీలన పూర్తయ్యే విధంగా వ్యవస్థ ఉండటంతో, ముఖ్యంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల దరఖాస్తులు త్వరితగతిన ఆమోదం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు . యాప్ ద్వారా సేకరించిన సమాచారం నేరుగా మీసేవ పోర్టల్‌కు అనుసంధానమై డేటా తక్షణమే అప్‌డేట్ అవుతుందని తెలిపారు.

ఈ శిక్షణ తరగతులకు జిల్లాలోని సుమారు 160 మంది జీపీవోలు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, 40 మంది నయాబ్ తహసీల్దార్లు మరియు 15 మంది ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. యాప్ డౌన్‌లోడ్ విధానం, లాగిన్ ప్రక్రియ, ఫీల్డ్ వెరిఫికేషన్ నమోదు, ఫోటో అప్‌లోడ్, రిపోర్ట్ సమర్పణ తదితర అంశాలపై ప్రదర్శనతో కూడిన సమగ్ర అవగాహన కల్పించారు. అధికారుల సందేహాలకు వివరణాత్మక సమాధానాలు అందించి, యాప్ వినియోగాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.

జిల్లాలో మీసేవ సేవలను మరింత పారదర్శకంగా మరియు సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు నాణ్యమైన సేవలను వేగవంతంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లు, పెన్నుల పంపిణీ



**పెన్ సత్తా, ఫిబ్రవరి 21:** మండల పరిధిలోని టి.ఎల్.పేట గ్రామపంచాయతీలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఈరోజు గురుకుల ప్రవేశ పరీక్షలకు హాజరవుతున్న నాలుగో తరగతి విద్యార్థులకు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లు మరియు పెన్నుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ గుగులోతు ప్రవీణ్, ఉప సర్పంచ్ నామ వెంకయ్య, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ట్యూషన్ మాస్టర్ జుజ్జురి కృష్ణమాచారి,ఏన్కూరు ప్రెస్ క్లబ్ సభ్యుల చేతుల మీదుగా పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు అవసరమైన పరీక్షా సామగ్రిని అందజేసి వారికి ఉత్సాహాన్ని నింపారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్య అనేది భవిష్యత్తుకు బలమైన పునాది అని, చిన్న వయస్సులోనే విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు ప్రోత్సాహం ఇచ్చారు.ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు సాధించగలరని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ చిన్న సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు.విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని గ్రామస్తులు కోరుతూ ప్రెస్ క్లబ్ సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ధీరావత్ సందీప్ నాయక్, ఉపాధ్యక్షులు బాలబత్తుల శివకుమార్, బానోతు గోపికృష్ణ,
నరసింహా,చంద్రశేఖర్,ఠాగూర్,రమేష్,రాము,అశోక్ రెడ్డి తదితరులు,గ్రామ పెద్దలు,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏన్కూరు ప్రెస్ క్లబ్ చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పరీక్షలపై ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో సహాయపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

## ధర్మసాగర్ లో పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్ష ప్రారంభం



**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెన్ సత్తా, ఫిబ్రవరి 21:** స్థానిక ధర్మసాగర్ మండల కేంద్ర జామియా మస్జిద్ నందు రంజాన్ మాసం ఉపవాస దీక్ష పురస్కరించుకుని మహ్మద్ సలీం కానిస్టేబుల్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ధర్మసాగర్ సీఐ శ్రీధర్ రావు ,ఎస్ ఐ లు నర్సింహ ,రవీంద్ర చారి , కానిస్టేబుల్ మున్వర్ హాజరై ఇఫ్తార్ విందు లో పాల్గొని పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా జామియా మస్జిద్ కమిటీ తరపున అతిథులకు శాలువా కప్పి శుక్రియా అదాచేయడం జరిగింది.

## తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, కేసీఆర్ మర్యాద పూర్వకంగా కలసిన సోషల్ మీడియా అధ్యక్షుడు

**చేగుంట : పెన్ సత్తా, ఫిబ్రవరి 21:** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు మర్యాదపూర్గంగా కలిసిన్న దౌల్తాబాద్ మండలం బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా నాయకులు సట్ట భాను ప్రసాద్, కరీంనగర్ మాజీ మేయర్ పాల్గొన్నారు,



## రాఘవపురం గ్రామంలో దోమల మందు స్ప్రే...



**చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 21: ప్రతినిధి.** చింతకాని మండలం రాఘవపురం పంచాయతీలో దోమల నివారణకు మందు కొట్టించడం జరిగింది, గ్రామంలో ప్రజలందరూ తమ ఇంటి ముందు నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని... అలాగే పాత టైర్లు, కొబ్బరి బోండాలు, పాత వాటర్ బాటిల్ లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోగలరు, పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేందుకు ప్రణాళిక తయారు చేయడం జరుగుతుంది, గ్రామ ప్రజలు అందరూ తగు జాగ్రత్తలు తీసుకొని పంచాయతీ వారికి సహకరించవలసిందిగా కోరుతున్నాం ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అబ్బూరి మహేష్, పంచాయతీ సిబ్బంది కొల్లి కొండయ్య, నల్గొండ కార్తీక్ పాల్గొన్నారు

## సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

**పెన్ సత్తా, ఫిబ్రవరి 21:** 25వ తారీఖు నాడు ఖమ్మం బంజారా భవన్లో అధికారికంగా నిర్వహించబడే సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఖమ్మం జిల్లా బంజారా భవన్లో సమావేశం నిర్వహించడం జరిగింది కార్యక్రమంలో బంజారా సంఘ నాయకులు విద్యార్థి సంఘ నాయకులు మహిళా సంఘం నాయకులు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ 25వ తారీకు ఉదయం 10 గంటలకు సేవాలాల్ మహారాజ్ పోగ్బండారో కార్యక్రమం ఉంటుందని తర్వాత భజన కార్యక్రమం బంజారా సాంస్కృతి సాంప్రదాయ నృత్యాలు ఆటపాటలతో అంగరంగ వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ కార్యక్రమానికి వచ్చినటువంటి ముఖ్య అతిధుల చేత అధికారుల చేత ప్రసంగాలు ఉంటాయని అనంతరం ప్రసాద వితరణ ఉంటుందని తెలియజేశారు కార్యక్రమం పోస్టర్ను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



భానోత్ కిషన్ నాయక్ బిక్షపతి రాథోడ్ రాంబాబు నాయక్ శివ లాల్ నాయక్ ఉపాధ్యాయ నాయకులు సేవాలాల్ విద్యార్థి సేవల విద్యార్థి సేన అధ్యక్షుడు పదవి ఉపాధ్యాయ నాయకులు శోభన్ నాయక్ సోమ్లా నాయక్ నాయక్ తారాబాయి సేవాలాల్ విద్యార్థి సేన అధ్యక్షుడు సాయి నాయక్ హరి తరుణ్ కమల్ స్టాలిన్ నాయక్ వినోద్ నాయక్ రమేషు నవీను సాగర్ అడ్వకేట్ జేఏసీ నాయకులు హరినాయక్ తదితరులు పాల్గొన్నారు

## తిర్లాపురం గ్రామంలోఫీడర్ కాలువల పూడికతీతపనిని విజిట్ చేసిన వై.కృష్ణయ్య పంచాయతీ టెక్నికల్ అసిస్టెంట్



గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు ఆధ్వర్యంలో

**చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 21: ప్రతినిధి.** చింతకాని మండల పరిధిలోని తిర్లాపురం గ్రామంలో గ్రామపంచాయతీ నందు జరుగుతున్న ఫీడర్ కాలువల పూడికతీతపనిని పంచాయతీ టెక్నికల్ అసిస్టెంట్ అధికారి వై కృష్ణయ్య మరియు తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు సమక్షంలో ఫీల్డ్ విజిట్ చేసి మస్టర్లు వెరిఫికేషన్ చేయడం జరిగింది. పనికి వచ్చిన ప్రతీ కూలీ కి 307/- రావాలి అంటే ఎంత పని చేయాలి అని కూలీల కి కొలతలు చెప్పి మార్కింగ్ చేయడం జరిగింది. చెప్పినా కొలతలు ప్రకారం ఖచ్చితంగా పని చేయాలని కూలీలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు ఫీల్డ్ అసిస్టెంట్ మడిపల్లి రామకృష్ణ, ఉపాధి కూలీలు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది చాపల మడుగు సైదులు పాల్గొన్నారు

## కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాస్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్న పాత్రికేయులు.



**చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 21: ప్రతినిధి.** ఖమ్మం కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాసరావు, నాగజ్యోతి దంపతుల కుమార్తె లిఖిత వివాహ వేడుక ఖమ్మంలో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో ఖమ్మం ఆర్డీవో జి నరసింహారావు, చింతకాని సీనియర్ పాత్రికేయులు నన్నక అప్పారావు, కాసిబొయిన రామారావు, అంబటి శాంతయ్య, చావా అరుణకుమార్, చిట్టూరు నరేష్, సురేందర్, గుడిది పిచ్చయ్య, షేక్ సైదా, మాజీ ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, టిఆర్ఎస్ నాయకులు వంకాయలపాటి సత్యనారాయణ, ఆళ్ల పానకాలు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున పాల్గొన్నారు.

## మెడికల్ కంటిన్జెన్సీ ఫండ్ అంటే ఏంటి..? హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్నోళ్లకు కూడా ఇది అవసరమా..?




ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు పెద్దోళ్లు. కానీ ఆ ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు మన జేబు ఖాళీ కాకుండా చూసుకోవడం అంతకంటే ముఖ్యం. చాలామంది ఒక హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసేసుకుంటే చాలు.. ఇక ఏ ఆపద వచ్చినా డోకా లేదు అని ధీమాగా ఉంటారు. కానీ అది ఒక భ్రమ మాత్రమే అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైద్య ద్రవ్యోల్బణం, పాలసీలో ఉండే లోపాలు, జేబులోంచి పెట్టాల్సిన అదనపు ఖర్చులు మన ఆర్థిక ప్రణాళికను తలకిందులు చేయగలవు. అందుకే కేవలం హెల్త్ ఇన్సూరెన్స్ పైనే ఆధారపడకుండా మెడికల్ బ్యాకప్ ఉండాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో అసలు నిజాలేంటో ఒకసారి చూద్దాం..

**ఇన్సూరెన్స్ ఉంటే సరిపోదు..**

దేశంలో మెడికల్ ద్రవ్యోల్బణం ఏటా 12-14 శాతం పెరుగుతోంది. అంటే ఈ రోజు 10 లక్షల రూపాయల ఖర్చయ్యే వైద్యం.. మరో ఐదేళ్లలో దాదాపు రెట్టింపు అవ్వచ్చు. కేవలం 10 లక్షల పాలసీ ఉందని నిశ్చింతగా ఉంటే.. భవిష్యత్తులో అది ఏ మూలకు సరిపోకపోవచ్చు. అలాగే దాదాపు 40% వైద్య ఖర్చులు ఇప్పటికీ సామాన్యులు తమ సేవింగ్స్ నుంచే చెల్లిస్తున్నారు. దీనికి కారణం పాలసీలు అన్నింటినీ కవర్ చేయకపోవడమే.

**కంటికి కనిపించని ఖర్చులు..**

ఆసుపత్రిలో అడ్మిట్ అయినప్పుడు బెడ్ చార్జీలు, డాక్టర్ ఫీజులు ఇన్సూరెన్స్ కంపెనీ కడుతుంది. కానీ కన్స్యూమబుల్స్ అంటే గ్లౌజులు, మాస్కులు, సర్జికల్ వస్తువులు, ప్రత్యేక డయాగ్నస్టిక్ టెస్టులు, రూమ్ రెంట్ క్యాపింగ్ వంటివి పాలసీహోల్డర్ల జేబుకు చిల్లు పెడతాయి. బిల్లులో ఇవి దాదాపు 5-15% వరకు ఉంటాయి. అంతేకాదు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక వాడే మందులు, ఫాలో-అప్ చెకప్‌ల ఖర్చును చాలా పాలసీలు భరించవు. ఇక్కడే మన మెడికల్ బ్యాకప్ ఫండ్ అండగా నిలుస్తుందన్నమాట.

**లిక్విడిటీ vs ప్రొటెక్షన్..**

ఇన్సూరెన్స్ అనేది కేవలం పెద్ద ఆసుపత్రి బిల్లుల నుంచి మాత్రమే రక్షణ కల్పిస్తుంది. కానీ అనారోగ్యం సమయంలో ఆదాయం కోల్పోవడం, ఇంటి వద్ద రికవరీ కోసం అయ్యే ఖర్చులు, ప్రయాణ ఖర్చులకు ఇన్సూరెన్స్ పనికిరాదు. అందుకే ప్రతి కుటుంబం కనీసం 6 నుండి 12 నెలల ఖర్చులకు సరిపడా క్యాష్ 'లిక్విడ్ రిజర్వ్'గా పెట్టుకోవాలి. ఇది ఒక హెల్త్ ఎమర్జెన్సీ వల్ల మీ దీర్ఘకాలిక పెట్టుబడులు, డిపాజిట్లు, బంగారం లాంటి వాటిని అమ్ముకోకుండా కాపాడుతుంది.

**చేయాల్సిన 'మెడికల్ బ్యాకప్' ప్లాన్..**

మీ పాలసీ ఎంత ఉందో.. అందులో సుమారు 40-50% మొత్తాన్ని విడిగా ఒక మెడికల్ కంటింజెన్సీ ఫండ్‌గా దాచిపెట్టుకోవాలి. ఉదాహరణకు మీకు 10 లక్షల హెల్త్ పాలసీ ఉంటే.. ఒక 5 లక్షల రూపాయలను అత్యవసర నిధిగా పక్కన పెట్టడం మంచిది. ముఖ్యంగా వృద్ధులు, రిటైర్డ్ వ్యక్తులకు ఈ ఫండ్ కింద సేవింగ్స్ మరింత ఎక్కువగా ఉండాలి. హెల్త్ ఇన్సూరెన్స్ అనేది ఆర్థిక రక్షణ కవచంలో ఫస్ట్ సేఫ్టీ నెట్ మాత్రమే. కానీ అది పూర్తి రక్షణ కాదు. ఆరోగ్య అత్యవసర స్థితి అనేది చెప్పి రాదు.. కానీ దానికి సిద్ధంగా ఉండటం మన చేతుల్లోనే ఉంది. ఇన్సూరెన్స్‌ను ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేస్తూ.. సమాంతరంగా ఒక ఎమర్జెన్సీ ఫండ్‌ను సిద్ధం చేసుకోవటం కీలకం.

## ట్రాఫిక్ కష్టాలకు చెక్: గాల్లో ఎగిరే ఎలక్ట్రిక్ టాక్సీలు.. రూ.8 వేల కోట్లు ఇన్వెస్ట్ చేసిన టయోటా




ట్రాఫిక్ కష్టాలకు ఇక కాలం చెల్లిపోనుంది. ఆకాశంలో ఎగిరే కార్లు అదేనండి ఎయిర్ టాక్సీలు త్వరలోనే మన ముందుకు రాబోతున్నాయి. ప్రపంచ ప్రసిద్ధ ఆటోమొబైల్ దిగ్గజం టయోటా ఈ కలను సాకారం చేసే దిశగా అడుగు వేసింది. కాలిఫోర్నియాకు చెందిన ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీ స్టార్టప్ జాబీ ఏవియేషన్‌లో టయోటా ఏకంగా 900 మిలియన్ డాలర్ల భారీ పెట్టుబడిని ప్రకటించింది. మన భారతీయ కరెన్సీలో దీని విలువ సుమారు 8వేల కోట్ల రూపాయలకు పైమాటే. భవిష్యత్తు రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ఈ భారీ డీల్ జరిగింది.ఎయిర్ టాక్సీ ప్రత్యేకతలను గమనిస్తే.. ఇది ఆరు రోటర్లతో పనిచేసే పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ వాహనం. ఇది నిటారుగా టేకాఫ్ అవ్వడమే కాకుండా.. గాల్లో నిశ్శబ్దంగా ప్రయాణిస్తుంది. నగరాల్లో కిక్కిరిసిన ట్రాఫిక్‌లో గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండా.. నిమిషాల్లోనే గమ్యస్థానానికి చేర్చేస్తుంది. కేవలం పెట్టుబడి పెట్టడమే కాకుండా.. టయోటా తన తయారీ నైపుణ్యాన్ని కూడా ఈ స్టార్టప్‌కు అందిస్తోంది. దీనివల్ల జాబీ ఏవియేషన్ తన ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచుకోగలుగుతోంది. ప్రస్తుతం నెలకు ఒక ఎయిర్ టాక్సీని మాత్రమే తయారు చేస్తున్న ఈ సంస్థ.. టయోటా సహకారంతో 2027 నాటికి నెలకు నాలుగు ఎయిర్ టాక్సీలను ఉత్పత్తి చేసే స్థాయికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. టయోటా ఇంజనీర్లు నేరుగా కాలిఫోర్నియాలోని తయారీ కేంద్రంలో పనిచేస్తూ.. ఉత్పత్తి ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. రవాణా రంగంలో కేవలం రోడ్లకే పరిమితం కాకుండా.. మొబిలిటీ ఫర్ ఆల్ అనే నినాదంతో టయోటా ఆకాశ మార్గంలో కూడా కొత్త ట్రాన్స్‌పోర్ట్ టెక్నాలజీలకు ఊతం ఇస్తోంది. పర్యావరణ హితమైన, శబ్దం లేని ఈ ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీలు అందుబాటులోకి వస్తే.. ఎయిర్ పోర్టులకు వెళ్లడం, ఒక నగరం నుంచి మరో నగరానికి ప్రయాణించడం చాలా సులభతరం అవుతుంది.

# సిబిల్ స్కోర్ సూపర్ ఉన్నా లోన్స్ రావట్లేదా.. అసలు తప్పు ఎక్కడ జరుగుతోందంటే..?




సిబిల్ స్కోర్ 750 కంటే ఎక్కువగా ఉంటే చాలు.. ఏ బ్యాంకైనా రెడ్ కార్పెట్ వేసి రమ్మని పిలిచి మరీ లోన్ ఇచ్చేస్తుందని చాలామంది అనుకుంటుంటారు. కానీ రియాలిటీలో పరిస్థితి మరోలా ఉంది. మంచి క్రెడిట్ స్కోర్ ఉండి, గతంలో సకాలంలో బాకీలు చెల్లించిన ట్రాక్ రికార్డ్ ఉన్నప్పటికీ.. అనేకమంది లోన్ అప్లికేషన్స్ రిజెక్ట్ అవుతున్నాయి. స్కోర్ అనేది కేవలం ఒక ప్రాథమిక అర్హత మాత్రమేనని.. లోన్ మంజూరు చేయడానికి బ్యాంకులు మరిన్ని లోతైన అంశాలను పరిశీలిస్తాయని గుర్తించాలి. మీ స్కోర్ బాగున్నా లోన్ ఎందుకు రావడం లేదో.. ఎక్కడ తప్పులు జరుగుతున్నాయో ఇప్పుడు తెలుసుకోండి..

**ఆదాయం అప్పుల నిష్పత్తి:**

క్రెడిట్ స్కోర్ 800 ఉన్నా సరే.. ఆదాయానికి మించి ఇప్పటికే అప్పులు ఉంటే బ్యాంకులు లోన్ ఇవ్వడానికి వెనుకాడతాయి. మీ నెలవారీ జీతంలో సగానికి పైగా మొత్తం ఇప్పటికే ఉన్న హోమ్ లోన్, కార్ లోన్ లేదా క్రెడిట్ కార్డ్ ఈఎంఐలకే పోతుంటే.. కొత్త అప్పులు తీసుకున్నా వాటిని తీర్చే సామర్థ్యం మీకు లేదని బ్యాంకులు భావిస్తాయి. దీనినే డెట్-టు-ఇన్కమ్ రేషియో అంటారు బ్యాంకింగ్ భాషలో.

**ఎక్కువ సార్లు లోన్ అప్లికేషన్స్:**

తక్కువ కాల వ్యవధిలోనే ఎక్కువసార్లు లోన్లు, క్రెడిట్ కార్డుల కోసం అప్లై చేయడం ఆర్థిక అస్థిరతకు సంకేతంగా కనిపిస్తుంది. మీరు అప్లై చేసిన ప్రతిసారీ బ్యాంకులు క్రెడిట్ రిపోర్టును పరిశీలిస్తాయి. ఇలా పదేపదే ఆర్థిక సంస్థలు, బ్యాంకుల నుంచి ఎంక్వయిరీలు జరగడం వల్ల మీరు అప్పుల కోసం తహతహలాడుతున్న కస్టమర్ల కేటగిరీలోకి వెళ్లిపోతారు. ఫలితంగా స్కోర్ బాగున్నా లోన్ రిజెక్షన్ జరుగుతుంది.

**పనిచేస్తున్న కంపెనీ గుర్తింపు:**

బ్యాంకులు కేవలం మీ సిబిల్ స్కోర్‌నే కాదు.. మీరు ఎక్కడ పని చేస్తున్నారు. ఎంత కాలంగా చేస్తున్నారు అనే అంశాలను కూడా చూస్తాయి. తరచూ ఉద్యోగాలు మారడం, ప్రస్తుత కంపెనీలో ప్రొబేషన్ పీరియడ్‌లో ఉండటం లేదా కంపెనీ బ్యాంకుల అప్రూవ్డ్ లిస్ట్ లో లేకపోవడం వంటివి లోన్ రిజెక్షన్‌కు దారితీస్తాయి. స్థిరమైన ఆదాయం, నమ్మకమైన సంస్థలో పని చేయడం లోన్ రావడానికి కీలకమని గుర్తుంచుకోండి.

**డాక్యుమెంటేషన్.. రిపోర్ట్ రిమార్క్స్:**

ఐడీ ప్రూఫ్, అడ్రస్ లేదా ఆదాయ ధృవీకరణ పత్రాల్లో చిన్న తేడాలు ఉన్నా అప్లికేషన్ తిరస్కరణకు గురవుతుంది. అలాగే మీ క్రెడిట్ రిపోర్టులో పాత అప్పుల విషయంలో 'సెటిల్డ్' అని ఉంటే అది నెగటివ్ మార్కుగా మారుతుంది. లోన్ పూర్తిగా కట్టేసి 'క్లోజ్డ్' అని ఉంటేనే అది మంచి రిపోర్ట్. లేట్ పేమెంట్స్ లేదా వడ్డీ తగ్గింపు కోసం చేసిన రిక్వెస్టులు కూడా రిపోర్టులో రిమార్క్స్‌గా మిగిలిపోతాయి.

**తక్కువ క్రెడిట్ హిస్టరీ:**

కేవలం ఒకే రకమైన క్రెడిట్ కార్డ్ లేదా లోన్ వాడటం కంటే.. సెక్యూర్డ్ హోమ్ లోన్, అన్-సెక్యూర్డ్ పర్సనల్ లోన్ అప్పుల కలయిక ఉండటాన్ని బ్యాంకులు ఇష్టపడతాయి. తక్కువ క్రెడిట్ హిస్టరీ ఉన్న వారికి కూడా బ్యాంకులు పెద్ద మొత్తంలో లోన్ ఇవ్వడానికి సాహసించవు.

**లోన్ రిజెక్ట్ అయితే ఏం చేయాలి..?**

ఒక సంస్థ లోన్ రిజెక్ట్ చేయగానే వెంటనే మరో బ్యాంకులో అప్లై చేయకండి. ముందుగా మీ క్రెడిట్ రిపోర్టును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులను సరిదిద్దుకోండి. ఇప్పటికే ఉన్న అప్పులను కొంతమేర తగ్గించుకుని.. కనీసం 3 నుండి 6 నెలల గ్యాప్ తర్వాత మళ్లీ తిరిగి ట్రై చేస్తే లోన్ రావటానికి చాన్సెస్ ఎక్కువగా ఉంటాయి. ఆర్థిక తప్పులు, పొరపాట్లను సరిచేసుకోకుండా ఎన్ని కంపెనీల చుట్టూ లోన్ కోసం తిరిగినా రిజెక్షన్ మాత్రమే ఎదురవుతుందని గుర్తుంచుకోండి.

# మీకో దండం.. మీ దేశానికో దండం : పాకిస్తాన్ నుంచి వెళ్లిపోయిన 125 కంపెనీలు




పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థకు మరో భారీ షాక్ తగిలింది. ఆ దేశంలో పెట్టుబడులు పెట్టడం అటుంచి.. ఇప్పటికే ఉన్న వ్యాపారాలను కొనసాగించడం కూడా భారంగా భావిస్తున్న అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు కట్టగట్టుకుని దాయాది దేశాన్ని విడిచి వెళ్లిపోతున్నాయి. పాకిస్తాన్ కార్పొరేట్ నియంత్రణ సంస్థ అయిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ఆఫ్ పాకిస్తాన్ విడుదల చేసిన తాజా జాబితా ఈ చేదు నిజాన్ని బయటపెట్టింది. జనవరి 20, 2026 నాటికి ఏకంగా 125 విదేశీ కంపెనీలు పాకిస్తాన్‌లో తమ కార్యకలాపాలను శాశ్వతంగా మూసివేశాయి.

**అన్ని రంగాల నుంచి ఎగ్జిట్..**

పాకిస్తాన్ అబ్జర్వర్ నివేదిక ప్రకారం.. కరాచీ, లాహోర్, ఇస్లామాబాద్, పెషావర్ వంటి ప్రధాన నగరాల్లో ఉన్న బ్రాంచ్ ఆఫీసులు.. లైజన్ కార్యాలయాలను విదేశీ కంపెనీలు మూసివేశాయి. కేవలం ఒక్క దేశం నుంచే కాకుండా అమెరికా, బ్రిటన్, యూఏఈ, చైనా, మలేషియా, సింగపూర్, జపాన్, టర్కీ, ఆస్ట్రేలియా, స్వీడన్, బహ్రెయిన్, కెనడా, ఫ్రాన్స్, నెదర్లాండ్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాలకు చెందిన చాలా కంపెనీలు కూడా పాకిస్తాన్ నుంచి తరలి వెళ్లిపోతున్నాయి బిజినెస్ క్లోజ్ చేసుకుని.

పాకిస్తాన్ వదిలి వెళ్లిన కంపెనీల జాబితాలో ప్రపంచ ప్రసిద్ధ బ్రాండ్లు ఉండటం గమనార్హం. ఇంధన రంగ దిగ్గజం ఎక్సాన్ మొబిల్ అనుబంధ సంస్థ తన వ్యాపారాన్ని మూసివేసింది. ఎలక్ట్రానిక్స్ రంగంలో పేరుగాంచిన పానాసోనిక్, ప్రముఖ విమానయాన సంస్థ లుఫ్తాన్సా జర్మన్ ఎయిర్ లైన్స్ కూడా తమ బోర్డులను తిప్పేశాయి. సాంకేతిక పరిజ్ఞానం, టెలికాం రంగం నుంచి డెల్ గ్లోబల్, నార్టెల్ నెట్వర్క్స్, టెలికార్డియా టెక్నాలజీస్ వంటి కంపెనీలు అక్కడి నుంచి సర్దుకున్నాయి.

ఆయిల్ అండ్ గ్యాస్ రంగం నుంచి హల్లీబుర్ట్?న్ లిమిటెడ్, నిర్మాణ రంగంలో డూసన్ హెవీ ఇండస్ట్రీస్ కంపెనీలు వెనుదిరిగాయి. బ్యాంకింగ్ రంగంపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉంది. మార్షక్ బ్యాంక్. జైరాత్ బ్యాంకాసీ వంటి అంతర్జాతీయ బ్యాంకులు పాకిస్తాన్ కార్యకలాపాలను చాలించుకున్నాయి. కేవలం వ్యాపార సంస్థలే కాకుండా.. సామాజిక వాణిజ్య సేవలందించే అమెరికన్ సోయాబీన్ అసోసియేషన్, పీస్ విండ్స్ జపాన్ వంటి ఎన్జీవోలు.. వాణిజ్య సంస్థలు కూడా తమ ఆఫీసులను మూసివేసిన లిస్టులో చేరిపోయాయి.

**ఈ దుస్థితికి కారణం ఏంటంటే..?**

ఈ కంపెనీలు పాకిస్థాన్ నుంచి ఎందుకు వెళ్లిపోయాయనే విషయమై ాజుజూా స్పష్టమైన కారణాలను వెల్లడించలేదు. కానీ పాకిస్తాన్‌లోని అస్థిరమైన ఆర్థిక పరిస్థితులు, విదేశీ మారక ద్రవ్య నిల్వల కొరత, రాజకీయ అనిశ్చితి వల్ల గ్లోబల్ ఇన్వెస్టర్లు అక్కడ ఉండటానికి భయపడుతున్నారని తేలింది. విదేశీ కంపెనీలు ఒక దేశాన్ని విడిచి వెళ్లడం అనేది ఆ దేశ పెట్టుబడి వాతావరణంపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యంగా డెల్, పానాసోనిక్, లుఫ్తాన్స వంటి బ్రాండ్లు తప్పుకోవడం పాకిస్తాన్ ప్రతిష్టను ప్రపంచ మార్కెట్‌లో దెబ్బతీస్తున్నాయని చెప్పుకోవచ్చు.

# వాట్సాప్ లో కొత్త ఫీచర్.. గ్రూప్ లో కొత్త మెంబర్లకోసం "గ్రూప్ మేసేజ్ హిస్టరీ"




వాట్సాప్ యూజర్లకు గుడ్ న్యూస్.. వాట్సాప్ లో కొత్త ఫీచర్ వచ్చింది. గ్రూప్ చాట్ చేసేవారికి ఇది బెస్ట్ వన్. ఇప్పటివరకు వాట్సాప్ గ్రూప్ లో కొత్త వారు జాయిన్ అయితే పాత మేసేజ్ లను చూడలేరు. అటువంటి వారికోసమే మెటా..గ్రూప్ మేసేజ్ హిస్టరీ అనే కొత్త ఫీచర్ ను అందిస్తోంది.

ఇప్పటివరకు వాట్సాప్ గ్రూప్‌లో కొత్తగా ఎవరైనా చేరితే, వారు పాత మెసేజ్‌లను చూడలేకపోయేవారు. దీంతో మిగతా సభ్యులు స్క్రీన్‌షాట్లు పంపడం లేదా మెసేజ్‌లను మాన్యువల్‌గా ఫార్వర్డ్ చేయడం చేసేవారు. ఇప్పుడు ఆ సమస్యకు చెక్ పడింది. గ్రూప్ మెసేజ్ హిస్టరీ ఫీచర్ ద్వారా అడ్మిన్లు లేదా గ్రూప్ సభ్యులు ఇటీవలి మెసేజ్‌లను కొత్తవారితో నేరుగా షేర్ చేయవచ్చు.అడ్మిన్లు, గ్రూప్ సభ్యులు ఇటీవలి మేసేజ్ లను కొత్తవారితో పంచుకోవడం ద్వారా కొత్త సభ్యులను త్వరగా కలుపుకునేందుకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. టీం వర్క్ ను స్పీడప్ చేస్తుంది. ఈ అప్డేట్ వాట్సాప్ మేసేజ్ ల మాదిరిగా నే ఎండ్ టు ఎండ్ ఎన్ క్రిప్ట్ అందిస్తుంది. మీరు చేసే మేసేజ్ లు, చాటింగ్ లకు ప్రైవసీ అందిస్తుంది. యూజర్లు ఇంతకుముందులాగా స్క్రీన్ షాట్ లు, మాన్యువల్ మేసేజ్ లను ఫార్వార్డ్ చేయాల్సిన అవసరం లేదు.

**100 వరకు మేసేజ్ లు పంపొచ్చు..**

గ్రూప్ మేసేజ్ హిస్టరీ ఫీచర్ ద్వారా ఒక గ్రూప్ లో కొత్తగా చేరిన సభ్యుడికి 25 నుంచి 100 మేసేజ్ లు పంపించవచ్చు. ఇది కొత్త వారికి త్వరగా గత విషయాలను తక్కువ సమయంలో తెలియజేయవచ్చు. అయితే ఈ ఫీచర్ ను నిర్వాహకులు కోరుకుంటే డిసేబుల్ చేయొచ్చు. తిరిగి ఎనేబుల్ చేసుకోవచ్చు.

టైమ్ స్టాంప్‌తో.. త్వరగా గుర్తించేలా..

ఈ ఫీచర్ ద్వారా షేర్ చేసిన మెసేజ్‌లు స్పష్టమైన టైమ్ స్టాంప్ తో కనిపిస్తాయి.

సాధారణ మెసేజ్‌ల కంటే ఇవి కొంచెం భిన్నంగా కనిపించడం వల్ల కొత్త సభ్యులు అవి షేర్ చేసిన హిస్టరీ అని సులభంగా గుర్తించగలరు.

గ్రూప్ చాట్‌లను మరింత సౌకర్యవంతంగా, పారదర్శకంగా మార్చేందుకు వాట్సాప్ తీసుకొచ్చిన ఈ ఫీచర్ యూజర్లకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ముఖ్యంగా ఆఫీస్ గ్రూప్‌లు, స్కూల్ గ్రూప్‌లు, కమ్యూనిటీ చాట్‌లకు ఇది బెస్ట్ ఫీచర్ అని చెప్పొచ్చు.

పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## మారిషస్ లో తెలుగు వెలుగు

ఆఫ్రికా ఖండ తీర ఆగ్నేయ తీరప్రాంతాల్లో 2000లో మీటర్ల దూరంలో హిందూ మహా సముద్రంలో ఉన్న ద్వీప దేశం మారిషస్. 2040 చ.కి.మీల వైశాల్యం కలిగి, పోర్టు లూయిస్ రాజధానిగా దాదాపు 12 లక్షల పై చిలుకు జనాభా కలిగి, ఆంగ్లం, తెలుగు అధికార భాషలుగా, మారిషియన్ క్రియోల్, ఫ్రెంచి, చైనీస్ ఉర్దూలతో పాటు, భోజ్ పూరి, మరాఠీ, తమిళం, ఉర్దూ తదితర భారతీయ ప్రాంతీయ భాషలు గా కలిగి ఉంది. 1630 – 1710 డచ్ కాలనీగా 1715 – 1810 మధ్య ఫ్రెంచ్ కాలనీగా తర్వాత 1968 వరకు బ్రిటిష్ కాలనీల నుండి తర్వాత స్వాతంత్రం పొందింది. 1903లో పైచెల్లిసును ప్రత్యేక కాలనీ గా రూపొందించిన తర్వాత మారిషస్ క్రమానుగత అభివృద్ధి జరుగు తున్నది. ఆఫ్రికా దేశాల మానవ అభివృద్ధి జాబితాలో ద్వితీయ స్థానంలో ఉన్న మారిషస్ హిందూ యిజం అతి పెద్ద మతంగా ఉన్న ఏకైక ఆఫ్రికా దేశంగా ప్రత్యేకతను కలిగి ఉంది.రైతులు చెరకు పొలాలలో పని చేయడానికి పెద్దసంఖ్యలో భారత దేశం నుండి కార్మికులను తీసుకు వచ్చారు. 1834 – 1921 మధ్యలో ద్వీపంలో సుమారు 5 లక్షల మంది కార్మికులు పనిచేసారు. నేడు మారిషస్ జనాభాలో 68% కంటే ఎక్కువ మంది భారతీయ మూలానికి చెందిన వారు, సాధారణంగా ఇండో – మారిషియన్లు అని పిలుస్తారు. ప్రైవేటు వ్యవసాయ దారుల క్రింద కూలీలుగా పనిచేయటానికి 1835 లో కిష్టమ్, వెంకటపతి, అప్పయ్య అనే ముగ్గురు తెలుగు వారు కాంది శీకులుగా తొలిసారిగా మారిషస్‌లో అడుగు పెట్టారు. ఆ మరుసటి సంవత్సరం గౌంజన్ అనే ఓడలో దాదాపు 30 మంది తెలుగు వారు ఆ ద్వీపంలో కాలు పెట్టారు. కాకినాడ సమీపాన వున్న 'కోరంగి' రేవు నుండి బయలు దేరి వచ్చినందుకు వాళ్లని "కోరంగి వాళ్ళు" అని, వారు మాట్లాడే తెలుగు భాషకు 'కోరంగి భాష' అని పిలిచేవారు. 1843 సంవత్సరంలో దాదాపు 35 ఓడల్లో భారతీయులు మారిషసు వలస వచ్చారు. వారిని తీసుకుని వచ్చిన ఓడల పేర్లు సిటీ ఆఫ్ లండన్, కింగ్ స్టన్, ఫ్లవర్ ఆఫ్ ఉగీర్, సుల్తాన్, సిరంగపట్నం, బాబా బ్రాహ్మిన్, కోరంగి పికేట్ మొదలైనవి. 1834లో పుట్టిన ఊళ్లను విడిచి, చెరుకు తోటల్లో పని చేసేందుకు కూలీలుగా మారిషస్ వెళ్లిన తెలుగు వారు మాత్రం తమ తరువాతి తరం వారు కూడా తెలుగు భాషను ప్రేమించి, మాట్లాడేలా పునాది వేశారు. మాతృ భాషకు బ్రహ్మో త్సవం జరిపారు. తెలుగుకు పట్టాభిషేకం చేస్తున్నారు. వారు తమతో తీసుకెళ్లిన వ్యవసాయ పరికరాలైన పలుగు, పారతో పాటు "పెద్ద బాలశిక్ష, రామాయణ, మహాభారతం" వంటి ఇతిహాస గ్రంథాలు, అక్కడి వారిని తెలుగు వారసులుగా తీర్చిదిద్దే ప్రయత్నానికి దోహద పడుతు న్నాయి. అవే ఇప్పటి ఆరవ తరం తెలుగువారూ భాషాయజ్ఞంలో మమేకం కావడానికి కొండంత ఆసరాగా నిలుస్తున్నాయి.మారిషస్ దేశానికి వెళ్లిన తెలుగువారు తొలుత తమ భాషా, సాంప్రదాయాలను నిలుపు కోవడానికి ఇబ్బందులను ఎదుర్కొన్నా, అక్కడికి వెళ్లిన వారిలో మేబర్ ప్రాంతానికి చెందిన పండిట్ గుణ్ణయ్య 1930లో తెలుగు భాషా వికాసానికి నడుం కట్టారు. ఇలా 1947లో ముందు మారిషస్ ఆంధ్ర మహా సభ, తర్వాత నామాంతరం చెంది మారిషస్ "తెలుగు మహా సభ"గా ఆవిర్భవించింది. దాన్ని వారు తెలుగు భాషామ తల్లి ఆలయంగా భావిస్తున్నారు.. ప్రస్తుతం మారిషస్ దేశంలో తెలుగు కుటుంబాల్లో ఆరవ తరం వారు సైతం, తమ పెద్దలు వేసిన బాటలో నడుస్తుం డటం ఇక్కడి తెలుగు వారికి స్ఫూర్తిదాయక అంశం. మారిషస్ దీవిలోని మొత్తం జనాభా దాదాపు 13 లక్షలైతే, తెలుగువారు 1లక్షమందికి పైగా ఉన్నారు. వీరికోసం సుమారు 300 తెలుగు పాఠశాలలు నడుస్తుండగా, 190 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారు. ప్రాథమిక తరగతులలో దాదాపు 10 వేల మంది విద్యార్థులు తెలుగు మాధ్యమంలో విద్యను అభ్యసి స్తున్నారు. మాధ్యమిక, ఉన్నత విద్య లో తెలుగు ద్వితీయ భాషగా ఉంది. ఉన్నత విద్యకోసం మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం పని చేస్తుంటే, తెలుగు మహాసభ, తెలుగు సాంస్కృతిక మండలి, తెలుగు యువ సంఘం, అనేక ఉప సంఘాలు సమన్వయంతో పని చేస్తున్నాయి. వీటికి మారిషస్ రిపబ్లిక్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి, పూర్తిస్థాయిలో ఆర్థికంగా చేయూత నిస్తున్నది. ఫ్రెంచికి దగ్గరగా ఉండే "క్రియోల్" వారి మాతృభాష అయినా, స్వ భాషాభిమానంతో, తెలుగును ద్వితీయ భాషగా ఎంచుకొని తెలుగును బతికిస్తున్నారు. ముఖ్యంగా ధర్మపురి నరసింహ శతకం, వేమన శతక పద్యాలకు వారు పెద్దపీట వేయడం, క్షేత్రయ్య అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు కీర్తనలు, నరసింహ శతకం, నేర్చు కోవడంతో పాటు తెలుగు సంప్రదాయాలనూ పూర్తిస్థాయిలో పాటించడం విశేషం. ఇటీవల అక్కడి విద్యార్థులే ఓ కథా సంకలనం వెలువరించడం వారికి తెలుగు గల అభిమానానికి, ప్రేమకు తార్కాణం.

మారిషస్‌లో ఓ ఆరాధ్య భావంతో తెలుగుకు బ్రహ్మోత్సవాలు 2018లో ఆగస్టు 20నుండి నిర్వహించి, అందులో భాగంగా, పద్య పఠన పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతి ప్రదానంతో పాటు ఒక్కోరోజు ఒక్కో తెలుగు సాంప్రదాయంపై అవగాహన కల్పించేందుకు వీలుగా సదస్సులను నిర్వహించారు. మారిషస్ దీవిలో తెలుగు భాషోన్న తికి సర్వస్వాన్ని ఫణంగా పెట్టి "సంజీవ నరసింహ అప్పడు" పని చేస్తున్నారు. ఆయన ఆ దేశ తెలుగు పరీక్షల విద్యాధికారి, రేడియో వ్యాఖ్యాత, జర్నలిస్ట్. మారిషస్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ తెలుగు విభాగ అధికారి. తెలుగు ప్రాంతాలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ అక్కడి తెలుగు వికాసానికి కృషి చేస్తున్నారు. తెలుగు తనాన్ని నిలుపు కొనేందుకు మారిషస్ తెలుగు మహాసభ, అక్కడి ప్రభుత్వం గట్టి సంకల్పంతో పని చేస్తున్నాయి. తెలుగు మహాసభ దేశ రాజధాని పోర్టు లూయిస్ లోని రాయల్ రోడ్డులో ప్రధాన కార్యాలయం కలిగి, ఏడు ప్రాంతీయ కమిటీలు, 90 శాఖలు క్రియా శీలకంగా పని చేస్తున్నాయి అంటే, ఆ సంస్థ తెలుగు భాషాభివృద్ధికి చేస్తున్న కృషి చెప్పకనే చెబుతున్నది. తెలుగు వారికి ప్రీతి పాత్రమైన ఉగాదితో పాటు వినాయక చవితి, దీపావళి, సంక్రాంతి జాతీయ సెలవుదినాలుగా పాటించడం గమనార్హం. తెలుగు వారి సంస్కృతి ప్రతీకలైన పండగలు, పబ్బాలు ఆచరిస్తున్నారు. ప్రస్తుతం తెలుగువారిచే నిర్మితాలైన 350 దేవాలయాలూ తెలుగు భాషా వికాసానికి కేంద్రాలుగా ఉన్నాయి.

# ఈ లడ్డు లాభాలు తెలిస్తే తినకుండా ఉండలేరు!



నువ్వుండలు.. చిన్నవిగా కనిపించినా, ఆయుర్వేదంలో వాటి ఆరోగ్య ప్రయోజనాలు అసాధారణమైనవి.. నువ్వుండలు జింక్, ఐరన్, కాల్షియం వంటి ముఖ్యమైన ఖనిజాలతో నిండి ఉంటాయి.. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఇవి ఎముకల బలానికి అద్భుతమైన మొక్కల ఆధారిత కాల్షియానికి మూలం. ఆయుర్వేదం, ఆయుష్షును గురించి తెలిపే ప్రాచీన భారతీయ వైద్య విధానం.. ఆహారాన్ని ఔషధంగా, ఔషధాన్ని ఆహారంగా పరిగణిస్తుంది. దీనికి ఉత్తమ ఉదాహరణ నువ్వుండలు.. నువ్వులు, బెల్లంతో కలిపి తయారుచేసే ఈ లడ్డూలు ఎన్నో సమస్యలను దూరం చేస్తాయి.. నువ్వుండలు చిన్నవిగా కనిపించినా, వీటి ఆరోగ్య ప్రయోజనాలు విస్తృతమైనవని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఏ సీజన్‌లోనైనా నువ్వుండలు శరీరానికి సహజమైన పోషకాలను అందిస్తూ, అనేక ఆరోగ్య సమస్యల నుండి రక్షణ కల్పిస్తాయి. బెల్లం నువ్వుండలు మంచి పోషకాహారం.. ఇవి కాల్చిన నువ్వులు, బెల్లం కలిపి చేసే సాంప్రదాయ, ఆరోగ్యకరమైన తీపి వంటకం. ఇది కాల్షియం, ఐరన్, యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలమని.. దీనిని పెద్దవాళ్లు నుంచి చిన్న పిల్లల వరకు అందరూ తినవచ్చు..

నువ్వుండల ప్రయోజనాలు.. రోగనిరోధక శక్తి బలోపేతం: శీతాకాలంతోపాటు.. అన్ని కాలాల్లో ఇన్ఫెక్షన్లు సర్వసాధారణం. నువ్వుండలు రోగనిరోధక శక్తిని గణనీయంగా పెంచుతాయి. వీటిలో జింక్, ఐరన్, కాల్షియం వంటి ముఖ్యమైన ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక కణాల ఉత్పత్తికి సహాయపడతాయి. జింక్ టీ కణాల పనితీరును మెరుగుపరుస్తుంది. ఆయుర్వేదం ప్రకారం, నువ్వులు బృంహణకరం (పోషకమైనవి), బల్యం (బలాన్ని పెంచేవి), వాత–కఫ దోషాలను సమతుల్యం చేస్తాయి. శరీరానికి సహజమైన వెచ్చదనం: నువ్వుండలు శీతాకాలపు చలి నుండి రక్షణ కల్పిస్తాయి. నువ్వులలోని ఆరోగ్యకరమైన కొవ్వు ఆమ్లాలు, ముఖ్యంగా పాలిఅన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్, శరీరంలో మెటబాలిక్ హీట్‌ను ఉత్పత్తి చేస్తాయి. శరీరాన్ని లోపల నుండి వెచ్చగా ఉంచుతాయి. ఆయుర్వేదం నువ్వులకు వేడి గుణం ఉందని చెబుతుంది.. అంటే అవి శరీరంలో వేడిని పెంచుతాయి. నువ్వుల నూనెను గోరువెచ్చగా చేసి పాదాలకు మర్దనా చేయడం కూడా స్థానిక రక్త ప్రసరణను పెంచి, చలిని తగ్గిస్తుంది.

బలమైన ఎముకలు, కీళ్ల ఆరోగ్యం: నువ్వులు మొక్కల ఆధారిత కాల్షియంకు అద్భుతమైన మూలం.. ఎముకల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలో ఉండే మెగ్నీషియం, భాస్వరం ఎముకల సాంద్రతను పెంచి, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలను నివారిస్తాయి. ముఖ్యంగా మహిళలకు నువ్వుండలు ఎముకల ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవి. ఆయుర్వేదం నువ్వులను అస్థి పోషక గుణం కలిగినవిగా వర్ణిస్తుంది. నువ్వుండలు కీళ్ల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయి. వీటిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు, ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్ కీళ్ల వాపును, నొప్పుల తీవ్రతను తగ్గిస్తాయి. నువ్వుల నూనెతో మర్దనా చేయడం వాత దోషాన్ని తగ్గించి కీళ్లకు బలాన్నిస్తుంది.

మెరుగైన జీర్ణ ఆరోగ్యం: శీతాకాలంలో మలబద్ధకం, అజీర్తి సాధారణ సమస్యలు. నువ్వుండలలో కరిగే, కరగని ఫైబర్ అధికంగా ఉంటుంది. కరగని ఫైబర్ మలాన్ని మృదువుగా చేసి సులభంగా విసర్జనకు సహాయపడుతుంది. కరిగే ఫైబర్ పేగుల్లో మంచి బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ఆయుర్వేదం నువ్వులకు అనులోమన గుణం ఉందని చెబుతుంది. ఇది వాతాన్ని క్రిందికి కదిలించి మలబద్ధకాన్ని నివారిస్తుంది. చర్మానికి, కణాల ఆరోగ్యానికి: నువ్వుండలు యాంటీ ఆక్సిడెంట్లకు నిలయం. ఇవి వృద్ధాప్య ఛాయలను అరికట్టి చర్మాన్ని తాజాగా ఉంచుతాయి. నువ్వులలోని సెసమిన్, సెసమాలిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి కణాల నష్టాన్ని తగ్గిస్తాయి. ఆయుర్వేదం ప్రకారం, నువ్వులకు రసాయన గుణం ఉంది. ఇది సప్త ధాతువులను (రస, రక్త, మాంస, మేదో, అస్థి, శుక్ర) పరిపుష్టం చేస్తుంది. నువ్వుల నూనెను చర్మానికి రాసుకోవడం వల్ల యవ్వనపు బిగుతుదనం వస్తుంది

గుండె ఆరోగ్యం, శక్తి: నువ్వుల్లోని ఆరోగ్యకరమైన కొవ్వులు, ముఖ్యంగా ఒలిక్ యాసిడ్, రక్తంలో చెడు కొలెస్ట్రాల్ (ఒఆఒ) స్థాయిలను తగ్గించి, రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆయుర్వేదం నువ్వులు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయని చెబుతుంది. కార్బోహైడ్రేట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు తక్షణ ? నిరంతర శక్తిని అందించి, రోజంతా చురుకుగా ఉంచుతాయి. రక్తహీనత నివారణ: రక్తహీనతతో బాధపడేవారికి నువ్వుండలు ఒక అద్భుతమైన పరిష్కారం. నువ్వులలో అధికంగా ఉండే ఐరన్ హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయపడి, శరీరంలో ఆక్సిజన్ సరఫరాను మెరుగుపరుస్తుంది. నల్ల నువ్వులు రక్త వర్ధకంగా పనిచేస్తాయని ఆయుర్వేదం పేర్కొంటుంది.

# కూర వండి తింటే కొండల్ని కూడా పిండి చేసే బలం



కొండపిండి ఆకు, దీనిని కిడ్నీలో రాళ్లు కరిగించడానికి ఉపయోగించే సంప్రదాయ ఔషధంగా గిరిజనులు తరతరాలుగా నమ్ముతున్నారు. కొండపిండి ఆకు కూర వండుకునే విధానం, దాని ఆరోగ్య ప్రయోజనాలను ఈ కథనంలో తెలుసుకుందాం. మూత్రపిండాల్లో రాళ్లను తొలగించడమే కాకుండా, స్త్రీలలో గర్భసంచి సమస్యలకూ ఇది మేలు చేస్తుందట.కొండపిండి ఆకు, గిరిజన ప్రాంతాలలో విరివిగా లభించే ఒక వనమూలిక. ఇది మూత్రపిండాల్లో రాళ్లను కరిగించడానికి ఒక శక్తివంతమైన సంప్రదాయ ఔషధంగా తరతరాలుగా ఉపయోస్తున్నారు. ఆధునిక జీవనశైలిలో 30 సంవత్సరాలు దాటిన చాలా మందిని వేధిస్తున్న కిడ్నీలో రాళ్ల సమస్యకు ఇది ఒక అద్భుతమైన పరిష్కారం అని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. గిరిజన ప్రజలు అడవిలో దొరికే వనమూలికలను ఉపయోగిస్తున్నారట. కొండపిండి ఆకును గుర్తించడం చాలా సులభం. దీని ఆకులు బూడిద రంగులో ఉండి, అక్కడక్కడ పువ్వుల మాదిరిగా కనిపిస్తాయి. ఈ ఆకును ఏజెన్సీ ప్రాంతాల్లో లేదా గ్రామాల సమీపంలో కూడా గుర్తించవచ్చు.

ఆకులను సేకరించిన తర్వాత, వాటిని జాగ్రత్తగా శుభ్రం చేసి, లేత ఆకులు, చిగుళ్లు, పూతలను మాత్రమే ఏరుకోవాలి. ఈ ప్రక్రియలో చెత్తను తొలగించడం చాలా ముఖ్యం.

కొండపిండి ఆకు కూర వండే విధానం: మొదటగా, ఆకులను శుభ్రంగా కడిగి చిన్న చిన్న ముక్కలుగా కోసుకోవాలి.

కావలసిన పదార్థాలు: ఉల్లిపాయలు, వెల్లుల్లి, పచ్చిమిర్చి, పచ్చిశనగపప్పు, జీలకర్ర. ముందుగా పొయ్యి మీద మట్టిపాత్రను పెట్టి వేడి చేయాలి. పాత్ర వేడెక్కిన తర్వాత నూనె వేసి, నూనె మరిగిన తర్వాత పచ్చిశనగపప్పు, జీలకర్ర వేసి కలుపుకోవాలి. తర్వాత వెల్లుల్లి, పచ్చి మిర్చి, ఉల్లిపాయలు వేసి బాగా వేగనివ్వాలి. ఇవి బాగా వేగిన తర్వాత తరిగిన కొండపిండి ఆకును వేసి బాగా కలపాలి. ఆకు బాగా ఉడకడానికి సరిపడా ఉప్పు (గడ్డ ఉప్పు దంచి మెత్తగా చేసి వేయడం మంచిది) వేసుకోవాలి. కూర అడుగు పడుతున్నప్పుడు కొద్దిగా నీళ్లు పోసి బాగా కలిపి ఉడికించుకోవాలి. కూర ఉడికిన తర్వాత దించుకోవచ్చు.

ఆరోగ్య ప్రయోజనాలు: కొండపిండి ఆకు కూర రుచికే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది. ఇది ముఖ్యంగా మూత్రపిండాల్లో రాళ్లు ఉన్నవారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, రాళ్లను కరిగించే శక్తి ఈ ఆకుకు ఉంటుందట. అందుకే దీనిని కొండలను కూడా పిండి చేసే సత్తా ఉన్న ఆకు అని కూడా అంటారు. పురుషులలో కిడ్నీలో రాళ్లను కరిగించడంలో సహాయపడటమే కాకుండా, స్త్రీలలో గర్భసంచి సమస్యలను కూడా ఇది తొలగిస్తుందట. ఈ సంప్రదాయ పద్ధతిని పాటించడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని సూచించారు.

# శివరాత్రికి రేగు పండ్లను నైవేద్యంగా ఎందుకు పెడతారు?



మహా శివరాత్రి పండుగ నాడు రేగుపండ్లను నైవేద్యంగా పెడతారు. రేగి పండ్లును బదరీఫలం అంటారు. నరనారాయణులు ఈ బదరీ వృక్షం (రేగుచెట్టు) వద్ద ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారనీ, ఆ ఫలా లని తింటూ తమ తపస్సుని కొనసాగించారనీ ప్రతీతి. వారు తపస్సు చేసే సమయంలో దేవతలు వారి తలపైన రేగి పండ్లు కురిపించారట. అందుకే ఆ ప్రదేశానికి బదరీక్షేత్రం అన్న పేరు వచ్చిందని చెబుతారు. ఈ కారణంగానే ఈ పండ్లను ఎంతో పవిత్రమైనవిగా భావిస్తారు.మహా శివరాత్రికి నైవేద్యంగా పెట్టే ఈ రేగి పండ్లు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. ఆయుర్వేదం ప్రకారం రేగు పండ్లలోని సహజ లక్షణాలు శరీరాన్ని లోపలి నుంచి బలోపేతం చేస్తాయి. ఉపవాస సమయంలో శక్తిని కాపాడుకోవ డానికి సహాయపడతాయి. పోషకాలతో సమృద్ధిగా ఉండే పండ్లు రేగు పండ్లు. వీటిలో విటమిన్ సి, ఫైబర్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఆయుర్వేద నిపుణులు కూడా రేగు పండ్లు తినడం చాలా ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు. అవి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. శరీరానికి అనేక ఇతర ప్రయోజనాలను అందిస్తాయి. ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు ఖచ్చితంగా రేగు పండ్లను తినాలని సిఫార్సు చేస్తున్నా రు. రేగు పండ్లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇవి మలబద్ధకం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందడంలో సహాయపడతాయి. ప్రేగులను శుభ్రంగా ఉంచుతాయి. రేగు పండ్లు విటమిన్ సి కి మంచి మూలం. ఇది శరీర రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. రేగు పండ్లను క్రమం తప్పకుండా తినడం వల్ల జలుబు, దగ్గు, ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. కాలానుగుణ వ్యాధుల నుంచి కూడా రక్షణ పొందవచ్చు.రేగు పండ్లలో ఐరన్, ఇతర ముఖ్యమైన ఖనిజాలు ఉంటాయి. ఇవి హిమోగ్లోబిన్‌ను పెంచడంలో సహాయపడతాయి. రక్తహీనతతో బాధపడేవారికి ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.రేగు పండ్లలోని యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తాయి. ముఖానికి సహజమైన మెరుపును ఇస్తాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం

రేగు పండ్లలో సహజ చక్కెరలు, తక్షణ శక్తిని అందించే పోషకాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల అలసట, బలహీనత, బద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. అయితే మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు రేగు పండ్లకు దూరంగా ఉండాలి.

# అసలు సవాలు ఇప్పుడు..

## దక్షిణాఫ్రికాతో భారత్ ఢీ

## రాత్రి 7 నుంచి

## సూపర్-8లో కీలక సమరం

గ్రూప్ దశలో కాస్త సవాలు ఎదురైనా అంతిమంగా టీమ్‌ఇండియాదే పైచేయి. పాకిస్థాన్ సహా ఏ జట్టూ భారత్‌ను అడ్డుకోలేకపోయింది. డిఫెండింగ్ ఛాంపియన్ అజేయంగా సూపర్-8లోకి అడుగు పెట్టింది. కానీ ఇక్కడి నుంచి మాత్రం ప్రయాణం అంత సాఫీగా ఉండకపోవచ్చు. ఏ ప్రత్యర్థితోనైనా పోరు కఠినమే. అందులోనూ ఈ దశలో తొలి మ్యాచ్ దక్షిణాఫ్రికాతో. గ్రూప్ దశలో భారత్‌ను మించి ఆధిపత్యం చలాయించిన జట్టది. కాబట్టి సూపర్-8లో శుభారంభం చేయాలంటే సూర్యసేన తమ ఆటను టాప్ గేర్‌లోకి తీసుకెళ్లాల్సిందే.

**అహ్మదాబాద్**

టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య భారత్‌కు అసలైన సవాల్! సూపర్ ఫామ్‌లో ఉన్న దక్షిణాఫ్రికాను ఆదివారం సూపర్-8 మ్యాచ్‌లో ఢీకొనబోతోంది టీమ్‌ఇండియా. భారత్ లాగే గ్రూప్ దశను నాలుగు విజయాలతో ముగించింది సఫారీ జట్టు. రెండు నెలల ముందు భారత్‌లో టీ20 సిరీస్ ఆడడం ఆ జట్టుకు అతి పెద్ద సానుకూలత. ఆ సిరీస్‌లో 1-3తో ఓడినప్పటికీ.. ఆతిథ్య జట్టుకు గట్టి పోటీనే ఇచ్చింది దక్షిణాఫ్రికా. ఆ సిరీస్ అనుభవంతోనే టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశలో ఆ జట్టు అదరగొట్టింది. గ్రూప్ దశలో అజేయంగా నిలిచినప్పటికీ.. భారత్ ఆట సాధికారికంగా సాగలేదు. నమీబియాతో మినహా మ్యాచ్‌ల్లో తడబాటు తప్పలేదు. జోరుమీదున్న సఫారీలపై నెగ్గాలంటే భారత్ తన అత్యుత్తమ ఆటను ఆడాల్సిందే.



అభిషేక్ ఇప్పుడైనా?: ఎన్నో అంచనాలతో టీ20 ప్రపంచకప్‌లో అడుగు పెట్టిన అభిషేక్ శర్మ.. గ్రూప్ దశ అంతా అసలు ఖాతానే తెరవడని ఎవ్వరూ ఊహించి ఉండరు. అనారోగ్యంతో నమీబియా మ్యాచ్ ఆడని అతను.. మిగతా మూడు మ్యాచ్‌ల్లోనూ డకౌటయ్యాడు. మరి సూపర్-8 నుంచి అయినా అతను అసలు ఆటను బయటికి తీస్తాడేమో అని అభిమానులు ఆశతో ఉన్నారు. అతడి ఓపెనింగ్ భాగస్వామి ఇషాన్ కిషన్ మాత్రం జోరుమీదున్నాడు. పాక్‌పై విధ్వంసక ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించిన అతడిపై మంచి అంచనాలున్నాయి. మూడో నంబర్ బ్యాటర్ తిలక్ వర్మ.. చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్‌లు ఆడుతున్నప్పటికీ.. స్ట్రైక్ రేట్ అతడికి సమస్యగా మారింది. అతను మరింత ధాటిగా ఆడాల్సిన అవసరముంది. కెప్టెన్ సూర్యకుమార్ అమెరికాపై విలువైన ఇన్నింగ్స్ ఆడాక ఇబ్బంది పడుతున్నాడు.

# సూపర్ 8లో న్యూజిలాండ్-పాకిస్తాన్ మ్యాచ్ రద్దు




టీ20 వరల్డ్ కప్ సూపర్ 8 తొలి మ్యాచ్ లో న్యూజిలాండ్ -పాకిస్తాన్ మ్యాచ్ రద్దైంది. కొలంబోలో జరుగుతోన్న ఈ మ్యాచ్ ఒక్క బాల్ కూడా వేయకుండానే వర్షం కారణంగా రద్దైంది. మ్యాచ్ రద్దుతో ఇరు జట్లకు చెరో పాయింట్ దక్కాయి. పాకిస్థాన్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేయాలని నిర్ణయించింది. కెప్టెన్ సల్మాన్ ఆఘా, వర్షం ముప్పు ఉన్నప్పటికీ తమ విజయ మంత్రాన్నే కొనసాగిస్తామని చెప్పాడు. అయితే టాస్ అనంతరం మళ్లీ వర్షం మొదలవడంతో పిచ్, అవుట్‌ఫీల్డ్ రక్షణ కోసం గ్రౌండ్ సిబ్బంది కవర్లు పూర్తిగా కప్పేశారు. ఇరు జట్ల ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్లలోకే పరిమితమయ్యారు. వర్షం తగ్గే చాన్స్ లేకపోవడంతో మ్యాచ్ ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. మ్యాచ్ రద్దుతో పాకిస్తాన్,న్యూజిలాండ్ సెమీస్ చేరాలంటే తమ చివరి మ్యాచుల్లో భారీ తేడాతో గెలవాల్సి ఉంటుంది.మరో వైపు రేపు పల్లెకెలెలో ఇంగ్లాండ్ శ్రీలంక,అహ్మదాబాద్ లో ఇండియా -సౌతాఫ్రికా తలపడనున్నాయి.

# 'పుష్ప 3' కోసం స్పెషల్ ఆఫీస్!




'పుష్ప' ఫ్రాంఛైజీ నుంచి 'పుష్ప : ది ర్యాంపేజ్' కోసం ప్రేక్షకుల్లో అప్పుడే ఆసక్తి మొదలైపోయింది. హీరో అల్లు అర్జున్-దర్శకుడు సుకుమార్ వేర్వేరు ప్రాజెక్ట్ లతో బిజీగా ఉన్నా? 'పుష్ప 3' మాత్రం నిరంతరం సోషల్ మీడియాలో చర్చకొస్తూనే ఉంది. ఆ సినిమా ఎప్పుడు మొదలు పెడతారు? ఎప్పుడు రిలీజ్ చేస్తారు? అన్న అంశాలపై రకరకాల గెస్సింగ్స్ తెరపైకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ప్రాజెక్ట్ గురించి కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మూడవ భాగంలో పుష్పరాజ్ తన సామ్రాజ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి ఎలా విస్తరించాడు ? ప్రత్యర్థులపై అతని దండయాత్ర ఎలా సాగిందనేది ప్రధానాంశంగా ఉండబోతోందిట. బన్నీ పాత్ర 'పుష్ప' రెండు భాగాలను మించి రెట్టింపు ఎనర్జీతో సాగుతుందని వినిపిస్తోంది. అప్పుడే ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా మొదలైనట్లు సన్నిహిత వర్గాల సమాచారం. ఇప్పటికే హైదరాబాద్‌లో 'పుష్ప 3' కోసం ప్రత్యేకంగా ఒక ఆఫీస్‌ను ఏర్పాటు చేసారట. సుకుమార్ అండ్ టీమ్ ఆఫీస్ అడ్డాగా పని చేస్తోంది. ఈ ప్రాజెక్ట్ కి సంబంధించి సుకుమార్ రైటింగ్ టీమ్ స్పెషల్ గా వర్క్ చేస్తోందట. సుకుమార్ ఆదేశాల మేరకు లీడ్స్ వదిలిన పాయింట్స్ నుంచి స్టోరీ ని బిల్డ్ చేస్తున్నారట. చిత్తూరు జపాన్ కథని ఎలా తీర్చిదిద్దితే బాగుంటుంది అన్న ఐడియా పై స్టోరీ రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది.దీనికి సంబంధించి అవసరం మేర స్పాట్ కు వెళ్లడం..అవసరమైన సమాచారం సేకరించడం వంటివి వెంట వెంటనే జరుగుతున్నాయట. టీమ్ అంతా ఐక్యంగా పని చేయడం కోసమే సుకుమార్ మిగతా సినిమాలతో సంబంధం లేకుండా 'పుష్ప 3' కోసమే ప్రత్యేకంగా ఆఫీస్ తీసినట్లు తెలుస్తోంది. సుకుమార్ పుష్పని ఓ యూనివర్స్ గా మార్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఇప్పటికే కోలీవుడ్, టాలీవుడ్ లో యూనివర్స్ ట్రెండ్ కొనసాగుతోంది. అందులో 'పుష్ప' పాన్ ఇండియాలో 2400 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ప్రాజెక్ట్ .కాబట్టి యూనివర్స్ క్రియేట్ చేసినా ఆలోచించాల్సిన పనిలేదు. 'పుష్ప 3' హీరో బన్నీ నే. అందులో ఎలాంటి సందేహం లేదు. 2028లో ఈ ప్రాజెక్ట్ రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేస్తున్నారు. ఒక వేళ యూనివర్స్ లోకి తీసుకొస్తే గనుక అక్కడ నుంచి హీరోలే మారే అవకాశం ఉంది. ప్రస్తుతం సుకుమార్ రామ్ చరణ్ తో తెరకెక్కించే సినిమా పనుల్లో బిజీగా ఉన్నాడు. అటు బన్నీ అట్లీ సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నాడు. వీళ్లిద్దరు ఫ్రీ అవ్వడానికి ఎలా లేదన్నా ఏడాదిన్నర సమయం పడుతుంది.

## రూట్ మార్చుకుంటున్న తెలుగమ్మాయిలు..

టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో తెలుగమ్మాయిలకు అవకాశం ఇవ్వడం లేదంటూ ఎంతో కాలంగా సోషల్ మీడియాలో వినిపిస్తున్న వార్త. కానీ నటనలో టాలెంట్ ఉంటే.. అది నిరూపించుకోగలిగితే కచ్చితంగా తెలుగమ్మాయిలకు అవకాశం ఇస్తారు అని వైష్ణవి చైతన్య, శివాని నాగారం లాంటి హీరోయిన్స్ ఎంతోమంది నిరూపించారు. ముఖ్యంగా వీరు తెలుగమ్మాయిలే కానీ తమ నటనతో అందరి దృష్టిని ఆకట్టుకొని మొదటి సినిమాతోనే మంచి పాపులారిటీ సొంతం చేసుకున్నారు. అంతేకాదు వరుస సినిమాలలో అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతున్నారు కూడా.అయితే మరి కొంతమంది హీరోయిన్స్ తమ ఉనికిని చాటుకోవడానికి బిగ్ బాస్ హౌస్ కి వెళ్లి, ఆ తర్వాత సినిమాల్లోకి వస్తున్నారు. మరికొంతమంది క్యారెక్టర్ ఆర్టిస్టులు గానే కెరియర్ కొనసాగిస్తున్నారు.. అయితే ఇక్కడ మరి కొంతమంది మాత్రం ఏకంగా తండ్రి వయసుతో సమానంగా ఉన్న సెలబ్రిటీల పక్కన భార్యలుగా నటించి అభిమానుల ఆగ్రహానికి గురవుతున్నారు. అలాంటి వారిలో సిరి హనుమంతు, సోనియా సింగ్.. ప్రథమ స్థానంలో నిలిచారు. నిజానికి వీరిద్దరూ కూడా సోషల్ మీడియా ద్వారా భారీ పాపులారిటీ అందుకున్నారు.ముఖ్యంగా సిరి హనుమంతు విషయానికొస్తే. యూట్యూబ్ ఛానల్ ద్వారా భారీ పాపులారిటీ సొంతం చేసుకుని, ఆ తర్వాత బిగ్ బాస్ లోకి అడుగుపెట్టి మంచి పాపులారిటీ అందుకుంది. ఆ తర్వాతే ఈమెకు ఆఫర్లు కూడా బాగానే వచ్చాయి. అయితే ఇటీవల శర్వానంద్ నటించిన 'నారీ నారీ నడుమ మురారి' సినిమాలో క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్ర పోషించింది .ఈ పాత్ర ఈమెకు ఇమేజ్ అందించిందికానీ 30 ఏళ్ల ఈ తెలుగమ్మాయి 66 ఏళ్ల నరేష్ భార్యగా నటించడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. కథకు డిమాండ్ ఉంది కాబట్టి అలాంటి పాత్ర చేసినా.. కానీ ఏకంగా తండ్రి వయసున్న వ్యక్తితో నటించడం అభిమానులు తట్టుకోలేకపోతున్నారు.దీనికి తోడు మరో యూట్యూబర్ , షార్ట్ ఫిలిం ఫేమ్ సోనియా సింగ్ ఇటీవల రవితేజ హీరోగా నటించిన' భర్త మహాశయులకు విజ్ఞప్తి' లో ఏకంగా 55 సంవత్సరాల వయసున్న సునీల్ సరసన నటించడం అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రస్తుతం ఈమె వయసు 26 సంవత్సరాల కావడం గమనార్హం. ముఖ్యంగా ఈ జంట సరదాగా సాగినా ఆడియన్స్ మాత్రం ఈ కాంబినేషన్ ను ఒప్పుకోవడం లేదు.

ఇకపోతే తెలుగమ్మాయిలకు హీరోయిన్గా అవకాశం ఇవ్వడం లేదు అని వార్తలు వస్తున్నా నేపథ్యంలో ఇలా క్యారెక్టర్ ఆర్టిస్టు పాత్రలతోనే ఇమేజ్ దక్కించుకోవాలని చూస్తున్నారు. మరి వీరి ఆలోచనల మేరకైనా భవిష్యత్తులో వీరికి మరిన్ని అవకాశాలు వస్తాయా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మరికొంతమంది పాత్ర డిమాండ్ చేస్తే వయసుతో సంబంధం లేదు అందుకే తెలుగు అమ్మాయిలు ఇండస్ట్రీలో తమ ఉనికిని చాటుకోవడానికి డిమాండ్ ఉన్న పాత్రలో నటిస్తూ మరింత క్రేజ్ దక్కించుకుంటున్నారు అంటూ కామెంట్లు చేస్తున్నారు నెటిజన్స్. మరి చూద్దాం తెలుగు అమ్మాయిల ఆలోచనలలో భారీ మార్పు వచ్చింది.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com